# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :215 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: ఆదివారం 02-11-2025 | పేజీలు:4 వెల: 2.00


### తెలంగాణలో పలువురు ఐఏఎస్ ల బదిలీ

హైదరాబాద్, తెలంగాణలో పలువురు ఐఏఎస్ అధికారులు బదిలీ అయ్యారు. ఎనిమిది మంది ఐఏఎస్ అధికారుల్ని బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. అభివృద్ధి సంక్షేమ పనుల అమలు విభాగం ప్రత్యేక కార్యదర్శిగా సైదులుకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు విడుదల చేసింది. ప్లాగ్‌షిప్ అభివృద్ధి, సంక్షేమ పనుల అమలు విభాగం ప్రత్యేక సీఎస్‌గా సవ్యసాచి ఘోష్ నియమితులయ్యారు. అలాగే, సంక్షేమశాఖ ప్రత్యేక సీఎస్‌గానూ ఆయన కొనసాగనున్నారు. గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి, కమిషనర్‌గా అనితా రామచంద్రన్‌కు అదనపు బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది. రవాణాశాఖ కమిషనర్‌గా కె.ఇలంబర్తిని నియమించిన ప్రభుత్వం.. పశుసంవర్ధక శాఖ కార్యదర్శిగా అదనపు బాధ్యతలను ఆయనకు అప్పగించింది. మెట్రోపాలిటన్ అర్బన్ డెవలప్‌మెంట్ కార్యదర్శి బాధ్యతలు సీఎస్ వద్దే ఉంచింది. జీఏడీ కార్యదర్శిగా ఇ.శ్రీధర్‌కు అదనపు బాధ్యతలు ఇచ్చింది. టీజీ ఆయిల్‌ఫెడ్ ఎండీగా యాస్మిన్ బాషాకు అదనపు బాధ్యతలు అప్పగించిన సర్కార్.. ఎస్సీ అభివృద్ధి శాఖ కమిషనర్‌గా జి.జితేందర్‌రెడ్డిని నియమించింది.

## దేశంలో అత్యంత పేదరికాన్ని నిర్మూలించిన తొలి రాష్ట్రంగా కేరళ



కేరళ: కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ కీలక ప్రకటన చేశారు. దేశంలో దుర్భర పేదరికాన్ని నిర్మూలించిన తొలి రాష్ట్రంగా కేరళ నిలిచినట్లు తెలిపారు. కేరళ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర అసెంబ్లీలో జరిగిన ప్రత్యేక సెషన్‌లో ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించారు. 2021లో ఎల్డీఎఫ్ సర్కార్ అధికారంలోకి వచ్చి, కొత్త మంత్రివర్గం ప్రమాణస్వీకారం చేసిన తర్వాత జరిగిన తొలి కేబినెట్ సమావేశంలో తీసుకున్న కీలక నిర్ణయాల్లో పేదరిక నిర్మూలన కూడా ఒకటని ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఈ సందర్భంగా తెలిపారు. ఇప్పుడు కేరళను దేశంలో అత్యంత పేదరికం లేని మొదటి రాష్ట్రంగా మార్చడంలో విజయం సాధించినట్లు చెప్పారు. 'నేటి కేరళ ఆవిర్భావ దినోత్సవం చరిత్రలో నిలిచిపోతుంది. ఎందుకంటే కేరళను అత్యంత పేదరికం లేని మొదటి రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో మేము విజయం సాధించాం. ఈ శాసనసభ అనేక చారిత్రక చట్టాలు, విధాన ప్రకటనలకు సాక్షిగా నిలిచింది. నవ కేరళ సృష్టిలో మరో మైలురాయిని గుర్తించే తరుణంలో అసెంబ్లీ ఇప్పుడు సమావేశమైంది' అని అన్నారు. 2021లో వరుసగా రెండో సారి అధికారంలోకి వచ్చిన తర్వాత విజయన్ సర్కార్ తన మొదటి కేబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. అందులో రాష్ట్రంలో అత్యంత పేదరికాన్ని నిర్మూలించడం కూడా ఒకటి. ఇందుకోసం ఓ ప్రత్యేక పథకాన్ని ప్రారంభించి.. రాష్ట్రంలో అత్యంత పేదరికంలో ఉన్న కుటుంబాలను గుర్తించింది. వారిని పేదరికం నుంచి బయటపడేసేందుకు చర్యలు చేపట్టింది. పేదరికంలో మగ్గుతున్న కుటుంబాలకు జీవనోపాధి ప్రాజెక్టుల ద్వారా పని కల్పించి వారు ఆర్థికంగా మెరుగుపడేందుకు సాయం చేసింది. ప్రజలందరికీ సమాన హక్కులు నివాసం, విద్య, వైద్యం అందించారు. ఫలితంగా నేడు రాష్ట్రం దుర్భర పేదరికం నుంచి బయటపడింది.

## భారత ఆర్మీ ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేలా కాంగ్రెస్ నేతల వ్యాఖ్యలు



హైదరాబాద్, నవంబర్ 1: కాంగ్రెస్ పార్టీపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పాకిస్థాన్ మీద కాంగ్రెస్ పార్టీ ప్రేమ, అభిమానం అజరామరమని.. గురువు నుంచి శిష్యుడి దాకా అదే వ్యామోహం అంటూ వ్యాఖ్యలు చేశారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా కిషన్ రెడ్డి స్పందిస్తూ.. సర్జికల్ స్ట్రైక్స్, ఆపరేషన్ సింధూర్‌ను చులకన చేస్తూ భారతీయ సైనికుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేలా మాట్లాడటం కాంగ్రెస్ పార్టీకి అలవాటుగా మారిపోయిందని మండిపడ్డారు. పాకిస్థాన్‌కు మద్దతుగా మాట్లాడుతూ భారత ఆర్మీని అగౌరవ పరుస్తున్నామనే సోయి లేకుండా కాంగ్రెస్ పార్టీ నేతలు మాట్లాడటం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాకిస్థాన్ వైపుకు స్టాండ్ తీసుకొని శత్రు దేశం భాషలో మాట్లాడుతూ శత్రువుల మాటలను సిగ్గు లేకుండా వల్లెవేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి రాజ్యాంగబద్ధ హోదాలో ఉండి కూడా నిజానిజాలు తెలియకుండా, దేశానికి వ్యతిరేకంగా మాట్లాడటం సిగ్గుచేటన్నారు. ముఖ్యమంత్రికి తెలియని విషయం ఏంటంటే.. పాకిస్థాన్ భూభాగంలో దాక్కున్న ఉగ్రవాదులను, వారి స్థావరాలను భారత గైడెడ్ క్షిపణులు విజయవంతంగా మట్టుబెట్టాయని.. 11 ఎయిర్ బేస్‌లను పూర్తిగా ధ్వంసం చేశాయన్నారు. ముఖ్యమంత్రి, కాంగ్రెస్ నాయకులు ముందు ఈ విషయాలను తెలుసుకుని మాట్లాడాలని కిషన్ రెడ్డి హితవుపలికారు.

## ఆరు గ్యారెంటీలా పేరుతో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్



మెదక్,నవంబర్ 1: ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని మాజీ ఉపాసభాపతి ఎం. పద్మ దేవేందర్ రెడ్డి విమర్శించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్‌ను భారీ మెజార్టీతో గెలిపించడమే లక్ష్యంగా పార్టీ ప్రజా ప్రతినిధులు, శ్రేణులతో కలసి ప్రత్యేక వ్యూహాలతో ప్రచార పర్వాన్ని సాగిస్తున్నారు. ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరిస్తూ.. ఇంటింటికి తిరుగుతూ ఓటు అభ్యర్థిస్తూ ముందుకు వెళ్తున్నారు. శనివారం ఎర్రగడ్డ డివిజన్‌లోని సుల్తాన్‌నగర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒక ఐరన్ షాపులో మహిళలతో మాట్లాడారు. కారు గుర్తుకు ఓటు వేసి మాగంటి సునీతను భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ.. కేసీఆర్ హయాంలో తమకు ఉపాధి కల్పించి రజకులకు ఐరన్ షాపులకు ఫ్రీ కరెంట్ ఇచ్చారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో మళ్ళీ ప్రజలకు కష్టాలు మొదలయ్యాయని పేర్కొన్నారు. తమ షాపులకు ఫ్రీ కరెంటు కట్ చేసి బిల్లు కొడుతున్నారని అవేదన వ్యక్తం చేశారు. మహిళలకు నెలకు రూ.2500 ఇస్తామని చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు. అనంతరం పద్మ దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీల పేరుతో చేసిన మోసాలను ప్రజలకు గుర్తు చేస్తూ 10 సంవత్సరాలు బీఆర్ఎస్ ప్రభుత్వం కేసీఆర్ పాలన గురించి తెలియజేసారు. రెండేండ్ల కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, గాలికి వదిలేసిన హామీలను ప్రజలకు వివరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అన్ని వర్గాల ప్రజలు సంక్షేమ పథకాలు అంది సంతోషంగా ఉన్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ప్రజలకు కష్టాలు నెలకొల్పిందని గుర్తు చేశారు. మహిళలకు నెలకు రూ.2500 ఇస్తామన్నారు, పెన్షన్ పెంచుతామని మోసం చేశారనీ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల పొట్ట కొట్టిందని రజక సోదరులకు కేసీఆర్ ప్రభుత్వం ప్రతి ఐరన్ షాప్‌కు కరెంటు ఫ్రీగా ఇచ్చామని గుర్తు చేశారు. కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్ పార్టీ మాగంటి సునీత గోపీనాథ్‌ను గెలిపించాలని ఈ సందర్భంగా కోరారు. ఈ ప్రచారంలో స్థానిక నాయకులతో పటు మెదక్ నాయకులు అహ్మద్, లింగా రెడ్డి, జుబేర్ అహ్మద్, కుమార్ యాదవ్, రాజ్ కుమార్, నరేష్, రంజిత్, లడ్డు తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగుల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలి



హైదరాబాద్ : రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగుల డిమాండ్‌లను వెంటనే పరిష్కరించాలని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి వీ శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో పార్టీ నాయకులు స్వామిగౌడ్, దేవిశ్రీప్రసాద్‌తో కలిసి ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ఉద్యోగుల పాత్ర ఎంతో ఉందన్నారు. రాష్ట్రం వచ్చిన తర్వాత ఉద్యోగులకు దేశంలో ఎక్కడా లేని విధంగా కేసీఆర్ మంచి ఫిట్‌మెంట్లు ఇచ్చారని చెప్పారు. రెండు పీఆర్సీలు ఇచ్చారని గుర్తుచేశారు. కేసీఆర్ కంటే ఎక్కువ ఇస్తామంటే ఉద్యోగులు కాంగ్రెస్‌కు ఓట్లేశారని, రిటైర్డ్ ఉద్యోగులు తమ బెనిఫిట్స్ రాక నానాయాతన పడుతున్నారని అన్నారు. పదివేల మంది డబ్బులు రాక ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ఇప్పటికే 250 మంది గుండె పగిలి చనిపోయారన్నారు. వారి మరణాలకు ప్రభుత్వానిదే బాధ్యత అని వ్యాఖ్యానించారు. ఓల్డ్ పెన్షన్ స్కీమ్ తెస్తామని తేలేదని విమర్శించారు. ఉద్యోగులు దాచుకున్న డబ్బును ప్రభుత్వం వాడుకుంటోందని ఆరోపించారు. ఉద్యోగులకు 44 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ ఉద్యోగులకు కూడా పీఆర్సీ ఇచ్చిన ఘనత కేసీఆర్‌దేనని శ్రీనివాస్ గౌడ్ చెప్పారు. ఇక శాసనమండలి మాజీ చైర్మన్ స్వామి గౌడ్ మాట్లాడుతూ.. రిటైర్డ్ ఉద్యోగులు అనారోగ్యం పాలైనా చికిత్స చేసుకోలేని పరిస్థితి ఉందని అన్నారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్ డబ్బులు రావడం లేదని చెప్పారు. కేసీఆర్ దయామయుడిలా ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులకు ఎవరూ చేయలేని పనులు చేశారని అన్నారు. ఉద్యోగుల డిమాండ్లు నెరవేరాలంటే జూబ్లీ హిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్‌ను ఓడించాలని చెప్పారు. కార్పొరేషన్ మాజీ చైర్మన్ జీ దేవీప్రసాద్ మాట్లాడుతూ.. మేనిఫెస్టోలో ఉద్యోగులకు ఇచ్చిన హామీల అమలును కాంగ్రెస్ ప్రభుత్వం తుంగలో తొక్కిందని విమర్శించారు. నెలలో మొదటి తారీఖున జీతాలిస్తున్నామన్న పేరుతో ఉద్యోగుల డిమాండ్లు వేటినీ కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కాంట్రాక్టు ఉద్యోగులకు మొదటి తారీఖున జీతాలు రావడం లేదని చెప్పారు. కేసీఆర్ హయాంలో మాత్రం ఉద్యోగులకు మొదటి తారీఖున జీతాలు రావడం లేదని దుష్ప్రచారం చేశారని మండిపడ్డారు. బీసీ హాస్టల్ ప్రైవేటు బిల్డింగులకు అద్దె చెల్లించడం లేదని ఆరోపించారు. పెన్షనర్స్ చాలా ఇబ్బందుల్లో ఉన్నారని చెప్పారు. గతంలో డీఏలు ఎగ్గొట్టిన వారికి ఉద్యోగులు గుణపాఠం చెప్పారు. రేవంత్ రెడ్డికి కూడా జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్‌కు తొడపాశం పెడితే ఉద్యోగుల సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. ఉద్యోగులు, పెన్షనర్లు జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్ వైపే ఉన్నారని చెప్పారు. ఉపఎన్నిక ఉందని నిన్న భట్టి విక్రమార్క రిటైర్డ్ ఉద్యోగుల బకాయిల చెల్లింపునకు కొన్ని నిధులు విడుదల చేశారని విమర్శించారు. గతంలో రూ.700 కోట్లు ప్రతి నెలా కేటాయిస్తామని చెప్పి మాట తప్పారని గుర్తుచేశారు. చివరకు రవీంద్ర భారతి కార్యక్రమంలో సీఎం చేతుల మీదుగా ఉద్యోగ నియామక పత్రాలు పొందిన వారికి కూడా మూడు నెలలుగా జీతాలు ఇవ్వలేదని చెప్పారు. మాటలు తప్ప చేతలు చేతగాని ఈ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు నమ్మే పరిస్థితి లేదని అన్నారు. ఈ ప్రెస్ మీట్‌లో ఉద్యోగసంఘాల నాయకులు భుజంగ రావు, సుమిత్రానంద్, హమీద్, వేణుగోపాల స్వామి పాల్గొన్నారు. ప్రెస్ మీట్ తర్వాత ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలపై బీఆర్ఎస్ రూపొందించిన కరపత్రాన్ని నేతలు విడుదల చేశారు.

## నా కుటుంబాన్ని టార్గెట్ చేశారు.. ఎన్వీ రమణ షాకింగ్ కామెంట్స్



అమరావతి, నవంబర్ 1: విట్ యూనివర్సిటీ కాన్వకేషన్‌లో సుప్రీంకోర్ట్ మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణ సంచలన వ్యాఖ్యలు చేశారు. అమరావతి నగరం రైతుల కష్టం, వారి త్యాగంపై నిర్మింపబడుతోందన్నారు. స్వాతంత్ర్యం తర్వాత అతి సుదీర్ఘంగా రాజధాని అమరావతి కోసం ఇక్కడి రైతులు పోరాటం చేశారని తెలిపారు. న్యాయవ్యవస్థపై రైతులు నమ్మకం ఉంచినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. తన కుటుంబాన్ని కూడా టార్గెట్ చేసి క్రిమినల్ కేసులు పెట్టారని ఈ సందర్భంగా ఎన్వీ రమణ షాకింగ్ కామెంట్స్ చేశారు. 'ఏ దేశం చూసినా ఏమున్నది గర్వకారణం' అంటూ మహాకవి శ్రీశ్రీ చెప్పిన కవిత్వాన్ని ఆయన ప్రస్తావించారు. 'కృష్ణా నది నాగరికతలో సామాన్య జీవితం ఎవ్వరిది... అమరావతి నిర్మాణానికి రాళ్లెత్తిన కూలీలెవ్వరు' అంటూ శ్రీశ్రీ కవిత్వాన్ని తనదైన శైలిలో మాజీ సీజేఐ అన్వయించారు. నాటి నిర్ణయాల వల్ల అమరావతి అనేక కష్టాలకు గురైందని తెలిపారు. కష్టకాలంలో విట్ లాంటి యూనివర్సిటీ నిలబడిందన్నారు. చుట్టప్రక్కల గ్రామాల ప్రజల స్కూలింగ్‌కు, ఆసుపత్రులకు విట్ సహకరిస్తుందని చెప్పారు. ఈ ప్రాంతం మొత్తం తనకు తెలుసని... అప్పట్లో ఎమర్జన్సీ సమయంలో కృష్ణానదిలో ఉన్న దిబ్బలపై రహస్య సమావేశాలు పెట్టుకున్నామంటూ ఆనాటి సంఘటనలను ఎన్వీ రమణ గుర్తుచేసుకున్నారు. కాగా.. విట్ ఏపీ యూనివర్సిటీ 5వ స్నాతకోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి సుప్రీంకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ ఎన్వీ రమణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అలాగే శామ్‌సంగ్ ఎలక్ట్రానిక్స్ సీనియర్ డైరెక్టర్ రాజీవ్ వర్మ గౌరవ అతిథిగా, విట్ వ్యవస్థాపకులు, కులపతి జి విశ్వనాథన్ హాజరయ్యారు. స్నాతకోత్సవం సందర్భంగా చాన్సిలర్ విశ్వనాథన్, చీఫ్ గెస్ట్ ఎన్వీ రమణ.. విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేశారు.

## శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలో ఘోరం..స్థానిక వేంకటేశ్వరాలయంలో తొక్కిసలాట



శ్రీకాకుళం,నవంబర్1: శ్రీకాకుళం జిల్లాలోని కాశీబుగ్గలో ఘోరం జరిగింది. కాశీబుగ్గలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో జరిగిన తొక్కిసలాటలో 9 మంది భక్తులు మృతి చెందారు. కార్తీక మాసం ఏకాదశి శనివారం కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారి దర్శనానికి తరలి వచ్చారు. ఈ సమయంలో అకస్మాత్తుగా జనసందోహం పెరగడంతో తొక్కిసలాట చోటు చేసుకుంది. ఈ తొక్కిసలాటలో పలువురు భక్తులు తీవ్రంగా గాయపడ్డారు. వారిని సమీపంలోని ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనతో ఆలయ పరిసరాల్లో తీవ్ర ఉద్రిక్తత కొనసాగుతుంది. పోలీసులు సంఘటన జరిగిన ఆలయానికి చేరుకుని పరిస్థితిని నియంత్రించారు. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈ ఘటనపై జిల్లా అధికారులు సమగ్ర విచారణకు ఆదేశాలు జారీ చేశారు. ఆలయ భద్రతా ఏర్పాట్లలో నిర్లక్ష్యం ఉందా అనే దానిపై కూడా దర్యాప్తు కొనసాగుతుంది. ఈ తొక్కిసలాట ఘటనపై దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆరా తీశారు. అయితే, తిరుమలలో దర్శనం కాలేదని సొంతంగా పండా కుటుంబం పదేళ్ల క్రితం 12 ఎకరాల భూమిలో ఈ కాశీబుగ్గ వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని నిర్మించారు. ఈరోజు కార్తీకమాసంలో వచ్చే ఏకదశి శనివారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో రావడంతో తొక్కిసలాట జరిగింది. దీంతో రెయిలింగ్ ఊడిపోయి వడంతో కిందపడ్డారు. దీంతో పిల్లలతో సహా తొమ్మిది మంది చనిపోయారు. ఆలయం దగ్గర సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఏకాదశి సందర్భంగా వేంకటేశ్వర స్వామి ఆలయానికి భక్తులు భారీగా పోటెత్తారు. ఈ నేపథ్యంలోనే తొక్కిసలాట చోటుచేసుకుంది. పలువురు భక్తులు స్పృహతప్పి పడిపోయారు. ఘటనాస్థలిలో సహాయచర్యలు కొనసాగుతున్నాయి. క్షతగాత్రులను స్థానిక ఆస్పత్రులకు తరలించారు. ఈ ప్రమాదంలో ఏడుగురు ఘటనాస్థలిలోనే మృతి చెందారు. ఇద్దరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో 8 మంది మహిళలు, 12 ఏళ్ల బాలుడు ఉన్నారు. సుమారు 25 మంది గాయపడినట్లు సమాచారం. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. మృతులను వై.చిన్నమ్మ, ఆర్.విజయ, ఎం.నేలమ్మ, డి.రాజేశ్వరి, సీహెచ్ పశోధామిగా గుర్తించారు. మరికొందరి వివరాలు తెలియాల్సి ఉంది. శ్రీకాకుళం జిల్లాలోని కాశీబుగ్గ వేంకటేశ్వర ఆలయంలో జరిగిన తొక్కిసలాట ఘటన కలచివేసిందని సీఎం చంద్రబాబు అన్నారు. 'ఈ దురదృష్టకర ఘటనలో భక్తులు మరణించడం అత్యంత విషాదకరం. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. గాయాల పాలైన వారికి సత్వర చికిత్స అందించాలని అధికారులను ఆదేశించాను. ఘటనా స్థలానికి వెళ్లి సహాయక చర్యలను పర్యవేక్షించాల్సిందిగా స్థానిక అధికారులను, ప్రజాప్రతినిధులను కోరాను' అని చంద్రబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఎక్స్ (ట్వీట్టర్) వేదికగా స్పందించిన ఆయన.. శ్రీకాకుళం జిల్లాలోని కాశీబుగ్గ వెంకటేశ్వర ఆలయంలో తొక్కిసలాట ఘటన తనను బాగా కలచివేసింది.. ఈ దురదృష్టకర ఘటనలో భక్తులు మరణించడం అత్యంత విషాదకరం.. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను.. ఈ తొక్కిసలాటలో గాయాల పాలైన వారికి సత్వర చికిత్స అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ ఘటనా స్థలానికి వెళ్లి సహాయక చర్యలను పర్యవేక్షించాల్సిందిగా స్థానిక అధికారులను, ప్రజాప్రతినిధులను కోరారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుంది అని సీఎం చంద్రబాబు భరోసా ఇచ్చారు. అలాగే, శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ వెంకటేశ్వర స్వామి ఆలయ తొక్కిలాట దుర్ఘటనపై రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటన గురించి అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ దురదృష్టకర ఘటనలో భక్తులు మరణించడం అత్యంత విషాదకరం అన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను.. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందచేయాలని అధికారులకు ఆదేశాం.. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలగా అండగా ఉంటుందని హోం మంత్రి అనిత హామీ ఇచ్చింది. శ్రీకాకుళం జిల్లాలోని కాశీబుగ్గ వెంకటేశ్వర ఆలయంలో తొక్కిసలాట ఘటన కలచివేసింది. ఈ దురదృష్టకర ఘటనలో భక్తులు మరణించడం అత్యంత విషాదకరం. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. గాయాల పాలైన వారికి మేలైన సత్వర చికిత్స అందించాలని అధికారులను ఆదేశించానని అన్నారు. ఆలయ తొక్కిసలాట ఘటనపై కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

## షట్‌డౌన్ ఎఫెక్ట్‌తో అమెరికాలో ఆర్థిక సంక్షోభం..




వాషింగ్టన్,అమెరికా ప్రభుత్వం షట్‌డౌన్ అయి నేటికి సరిగ్గా నెలరోజులైంది. సేనేట్‌లో రిపబ్లికన్లు ప్రవేశపెట్టిన ఫెడరల్ నిధులకు చెందిన బిల్లుకు ఆమోదం దక్కకపోవడంతో అక్టోబర్ 1న అమెరికా ప్రభుత్వం షట్‌డౌన్ ప్రకటించింది. ఈ షట్‌డౌన్ కారణంగా అగ్రరాజ్యంలో ఆర్థిక సంక్షోభం తలెత్తింది. అక్టోబర్ 1 నుంచి ఇప్పటి వరకూ దాదాపు 7 బిలియన్ డాలర్ల నష్టం వాటిల్లినట్లు కాంగ్రెషనల్ బడ్జెట్ ఆఫీస్ గణాంకాలు చెబుతున్నాయి. ఈ ప్రతిష్ఠంభణ మరింత ఎక్కువ కాలం కొనసాగితే అమెరికా ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ వారం కాంగ్రెషనల్ బడ్జెట్ ఆఫీస్ విడుదల చేసిన తాజా అంచనాల ప్రకారం.. ఈ షట్‌డౌన్ కారణంగా ఇప్పటికే 7 బిలియన్ డాలర్ల నష్టం వాటిల్లింది. ఇలాగే కొనసాగితే ఆర్థిక నష్టం మరింత పెరుగుతుంది. షట్‌డౌన్ ఆరు వారాలు కొనసాగితే నష్టం 11 బిలియన్ డాలర్లకు, 8 వారాలు కొనసాగితే 14 బిలియన్ డాలర్లకు చేరుకునే ప్రమాదం ఉంది. మరోవైపు ప్రస్తుతం ఆర్థిక వ్యవస్థ దుర్బలంగా ఉందని, ప్రభుత్వ షట్‌డౌన్ ప్రజలు అనుకున్న దానికంటే చాలా వేగంగా పెద్ద సమస్యగా మారే ప్రమాదం ఉందని మూడీస్ అనలిటిక్స్ చీఫ్ ఎనకామినస్ట్ మార్క్ జాండి హెచ్చరించారు. సేనేట్‌లో రిపబ్లికన్లు ప్రవేశపెట్టిన ఫెడరల్ నిధులకు చెందిన బిల్లుకు ఆమోదం దక్కకపోవడంతో అమెరికా ప్రభుత్వం షట్‌డౌన్ ప్రకటించింది. అమెరికా కాలమానం ప్రకారం సెప్టెంబర్ 30, అర్ధరాత్రి (11:59 నిమిషాలు) వరకు ఆ బిల్లు క్లియరెన్స్ కోసం ఎదురుచూశారు. కానీ డెమోక్రాట్లు తగ్గకపోవడంతో.. ట్రంప్ సర్కారు షట్‌డౌన్ ప్రకటించింది. సేనేట్‌లో రిపబ్లికన్లకు కంట్రోల్ ఉన్నా.. బిల్లును పాస్ చేయించుకోలేకపోయారు. ఫండింగ్ బిల్లు సేనేట్‌లో పాస్ కాకపోవడం వల్ల నిరవధికంగా ప్రభుత్వ షట్‌డౌన్ ప్రకటిస్తున్నట్లు వైట్‌హౌజ్ పేర్కొన్నది. గడిచిన ఏడేళ్లలో ఇలా జరగడం ఇదే మొదటిసారి.

## సంపాదకీయం

ఆదివారం 02-11-2025

# వరద సహాయక చర్యల్లో వైఫల్యం !

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక, అజారుద్దీన్‌కు మంత్రి పదవి.. ఈ రెండే కాంగ్రెస్ ప్రభుత్వ ఎజెండాలో ఉన్నాయా అన్న అనుమానం కలుగుతోంది. మొంథా తుఫాన్‌తో రాష్ట్రం విలవిల్లాడినా, వరంగల్ నగరం మునిగి ప్రజలంతా నీటి పాలయినా ఎక్కడా సహాయక చర్యలు సక్రమంగా లేవు. రెండు రోజులపాటు, ఇల్లూ వాకిలి వదిలి వెళ్లిన ప్రజలు ఇంటికి వచ్చే వరకు సర్వం కొట్టుకు పోయింది. అయినా వారి ఇళ్లను శుభ్రం చేసు కోవాలంటే నీరు లేదు. తాగడానికి నీళు లేవు. భోజనం సంగతి వేరుగా చెప్పాల్సిన పనిలేదు. ఉన్నదంతా ఊడ్చుకుపోయినా వారిని ఆదుకునేందుకు ఎవ్వరూ కనరాలేదు. గోపాలపురం, భీమారం పరిధిలోని కాలనీ ప్రజల వ్యధ అంతాఇంతా కాదు. ఏపిలో సిఎం చంద్రబాబు, ఆయన మంత్రులు, అధికారులు నిముష నిముషానికి సమీక్షించి ప్రజలకు అండగా నిలిచారు. తుఫాన్ తీరం దాటిన తెల్లవారే చంద్రబాబు బాధిత ప్రాంతాల్లో పర్యటించారు. మంత్రులు పర్యటించారు. కానీ ఓరుగల్లులో అలాంటి పరిస్థితి కానరాలేదు. తెలంగాణలో మాత్రం అలాలేదు. మంత్రులు అందరూ జూబ్లీహిల్స్‌లో ఊరేగితే రాష్ట్రంలో పాలన పరిస్థితి, ప్రజల పరిస్థితి ఏంటని వరంగల్ ముంపు ప్రాంతాలను చూస్తే అర్థం అవుతుంది. మంత్రులు కోరుకుంటే హెలికాప్టర్లు వస్తాయి.. ప్రజలు ఆపదలో ఉంటే మాత్రం రావా అని ప్రజలే నిలదీస్తున్నారు. హనుమకొండ, జులైవాడలో భారీగా కురిసిన వర్షానికి నీట మునిగిన కాలనీలతో పాటు అమరావతి నగర్, సమ్మయ్య నగర్, 100 ఫీట్ రోడ్డులో ఉధృతంగా ప్రవహిస్తున్న వరద ఉధృతిని పరిశీలించేందుకు మంత్రులు ఎవ్వరూ రాకపోవడం వింతే. మొంథా వరద భీభత్సంతో గ్రేటర్ వరంగల్ పరిధిలోని అనేక కాలనీలు నీటి మునిగి, నగరం జల దిగ్బంధం అయింది. నిత్యావసర వస్తువులు సహా, విలువైన టీవీ, బీరువాలు సైతం నీట మునిగి ఆస్తి నష్టం వాటిల్లింది. వృద్ధులు, వికలాంగులు, బాలింతలు రాత్రంతా నీటమునిగిన ఇళ్లల్లోనే గడిపారు. తుఫాన్ తీవ్రతను ముందస్తుగా గ్రహించి అంచనా వేయడంలో, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం లో అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. తక్షణమే నీటి మునిగిన ప్రాంతాల్లో ఆస్తి నష్టం అంచనా వేసి నష్టపరిహారం చెల్లించాల్సి ఉంది. సమ్మయ్య నగర్ పూర్తిగా నీట మునిగి ప్రజలు సర్వం కోల్పోవడం జరిగింది. ఆవులు, గేదెలు, పశువులు అరుస్తూ వరదల్లో కొట్టుకుపోవడం వాటి యజమానులను కలిచి వేసింది. ఆస్తి నష్టంతో పాటు పశు పక్షాదుల ప్రాణ నష్టం కూడా భారీగా వాటిల్లే ప్రమాదం ఉంది. మొంథా తుఫాన్ దూసుకొస్తుందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసినాముందస్తు చర్యలు తీసుకోవడంల ప్రభుత్వ వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది. ఈ సమయంలో ఒక్క జిల్లాకు ఒక్కో మంత్రి ఇంచార్జీగా ఉండి.. వరద ప్రాంత ప్రజలకు రక్షణగా ఉండాలి. ఇన్‌ఛార్జ్ మంత్రిగా ఉన్న వారితో సహా జిల్లాలకు చెందిన మంత్రులు కూడా పెద్దగా ప్రభావం చూపలేదు. లోతట్టు ప్రాంతాల ప్రజల జీవనం కూడా దుర్భరంగా మారింది. శివనగర్, మైసయ్య నగర్, ఆర్ఎస్ నగర్, చింతల్ ప్రాంతాల్లోని అనేక కాలనీలు పూర్తిగా జలమయమయ్యాయి. ముఖ్యంగా శివనగర్ మరియు మైసయ్య నగర్లలోని ఇళ్లలోకి వరద నీరు భారీగా చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇండ్లలోని గృహోపకరణాలు, నిత్యావసర వస్తువులు అన్నీ నీటిలో తడిచి ముద్దయ్యాయి. రాత్రంతా నిద్రలేని రాత్రులు గడిపి, ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని బతుకుతున్నారు. వరద బాధితులను దృష్టిలో ఉంచుకుని అధికారులు శివనగర్‌లో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. ముంపు ప్రాంతాల్లో బల్దియా పారిశుధ్య కార్మికులు సహాయ కార్యక్రమాలు చేపట్టారు. రోడ్లమీద, డ్రైనేజీ, నాలాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించే పనిలో నిమగ్నమయ్యారు. ఇకపోతే భారీ వర్షాలు, వరదలతో భీభత్సం సృష్టించిన మొంథా తుఫాన్ అన్నదాతల ఆశలపై పిడుగు పాటుగా మారింది. చేతికొచ్చిన పంటలు నేలపాలు కావడంతో ఉమ్మడి వరంగల్ జిల్లా రైతులు తీవ్ర ఆందోళనలో మునిగిపోయారు. కేవలం పంటలే కాక, లోతట్టు ప్రాంతాల ప్రజల జీవితాలు కూడా వరదనీటిలో చిక్కుకుపోయాయి. గ్రేటర్ వరంగల్ పరిధిలోని 17వ డివిజన్‌లోని విలీన గ్రామాల రైతులను తుఫాన్ నిండా ముంచింది. కోతకు సిద్ధంగా ఉన్న వరి పంట పొలాలన్నీ చెరువులను తలపిస్తూ పూర్తిగా నేలకొరిగాయి. అలాగే, ఖిలా వరంగల్‌లో పరిస్థితి మరింత దారుణంగా మారింది. వందల ఎకరాల్లో పండించిన ఆకుకూరలు, కూరగాయల తోటలు ఏకంగా 6 అడుగుల నీటి కింద మునిగిపోయాయి. కోట ప్రాంతంలో రైతులు తమ సర్వస్వం కోల్పోయి రోడ్డున పడ్డారు. కళ్ల ముందు పంట నాశనం కావడంతో, వారు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. కష్టపడి సాగు చేసిన పంట వారం రోజుల్లో చేతికి వస్తది అనుకున్న అన్నదాతల ఆశ ఆడియోసలైంది. మొత్తం తుఫాన్‌కు ఆహుతి కావడంతో, ఆపదలో ఉన్న తమను ఆదుకోవాలని, కనీసం పెట్టుబడికైనా సాయం చేయాలని వారు కోరుకుంటున్నారు. ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తున్నారు. పరిస్థితి ఇలా ఉంటే శుక్రవారం వరంగల్ పర్యటనకు సిఎం రేవంత్ రెడ్డి వస్తున్నారు. అయితే మంత్రులు ఇటుపై దృష్టి పెట్టి ముందస్తు హెచ్చరికలు చేసివుంటే.. ప్రజలను సరుక్షిత ప్రాంతాలకు తరలించివుంటే నష్టం తగ్గించగలిగే వారు. ఇప్పటికైనా ఆపన్నులను ఆదుకోవాలి. సర్వం కోల్పోయిన వారికి వంటసామాన్లు సహా అన్ని కొని ఇవ్వాలి. రైతులను ఆదుకోవాలి. తడిసిన ధన్యం వెంటనే కొనుగోలు చేయాలి.

# తెలంగాణ రైతులపై మొంథా దెబ్బ



వరంగల్/కరీంనగర్, మొంథా తుఫాన్ ప్రభావంతో తెలంగాణ వ్యాప్తంగా రైతులు తీవ్రంగా నష్టపోయారు. పలుచోట్ల ఆరబోసిన ధాన్యం కొట్టుకుపోయింది. అలాగే పలుచోట్ల పంటలు నీట మునిగాయి. గోడదెబ్బ చెంపదెబ్బలా రైతుల పరిస్థితి దయనీయంగా ఉంది. ప్రభుత్వానికి అందిన వ్యవసాయ శాఖ ప్రాథమిక నివేదిక ప్రకారం.. రాష్ట్రవ్యాప్తంగా సుమారు ఐదు లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. పంజా విసిరిన మొంథా తుఫాన్ దాటికి తల్లడిల్లుతున్న అన్నదాతలను, నిరాశ్రయులను ప్రభుత్వం ఆదుకో వాలని మండల ప్రజలు అర్థిస్తున్నారు. మూడు, నాలుగు నెలలు కష్టపడి పెంచి పెద్ద చేసిన పొలాలు చేతికందే దశలో ఒక్క వర్షం అతలాకుతలం చేసింది. రెండు మూడు రోజుల్లో వరి కోయడానికి సిద్ధంగా ఉన్న రైతులను తుఫాను నిండా ముంచింది. కురిసిన భారీ వర్షంతో పొలాలు కింద పడిపోయి మడికట్లలో నీళ్లు నిలిచిపోయి గొలుసు మొత్తం వాలిపోయింది. ఎక్కడో చోట తప్ప దాదాపు అన్ని పొలాలు నేలవాలాయి. వరి కోయని రైతుల పరిస్థితి ఒకలా ఉంటే కోసిన రైతుల కన్నీటి వ్యథ మరో తీరు ఉన్నది. అమ్ముకునేందుకు కళ్ళాల్లో పోసి ఆరబోసిన తరుణంలో వర్షం రావడంతో తడిసి ముద్దయిపోయాయి. వర్షం వస్తుందన్న సమాచారంతో రాశులుగా పోసినప్పటికీ భారీ వర్షానికి తడిసి పోయాయి. మరోవైపు కల్లాల నుంచి నీళ్లు బయటకు పోలేని పరిస్థితుల్లో పూర్తిగా నీటిమట్ట మయ్యాయి. భారీ వర్షాలకు కుంటలు, వాగులు పొంగిపొర్లడంతో పలు గ్రామాలకు రాకపోకలు బంద్ అయ్యాయి. కల్వర్టులు ఉప్పొంగడంతో ఎక్కడి వారు అక్కడే నిలిచి పోయారు. అత్యధికంగా వరంగల్ జిల్లాలో పంట నష్టం చోటు చేసుకోగా, ఖమ్మం, సూర్యాపేట, నల్గొండ జిల్లాల్లోనూ రైతులు భారీగా నష్టపోయారు. తుఫాను కారణంగా ప్రధానంగా వరి, పత్తి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. 2.80 లక్షల ఎకరాల్లో వరి పంట, 1.50 లక్షల ఎకరాల్లో పత్తి, 4 వేల ఎకరాల్లో మొక్కజొన్న, 3 వేల ఎకరాల్లో మిరప, వేల ఎకరాల్లో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. రాష్ట్ర ప్రభుత్వం నష్టపరిహారంపై సమగ్ర నివేదిక సిద్ధం చేసేందుకు సూచనలు జారీ చేసినట్లు సమాచారం. మరోవైపు.. మొంథా తుఫాను ఎఫెక్ట్ తో ఆర్ అండ్‌బీ రోడ్లు 334 లోకేషన్స్‌లో 230 కి.మీ దెబ్బతిన్నాయని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. రోడ్లు భవనాలు శాఖ పూర్తి అప్రమత్తంగా ఉందని వెల్లడించారు. దెబ్బతిన్న, కోతకు గురైన రోడ్లు, బ్రిడ్జిలు,కాజ్‌వేల తాత్కాలిక పునరుద్ధరణకు సుమారు రూ. 7కోట్లు, శాశ్వత పునరుద్ధరణకు రూ. 225 కోట్ల వరకు ఖర్చు అవుతుందని అధికారులు అంచనాలు రూపొందించినట్లు స్పష్టం చేశారు. తుఫాన్ వల్ల అకాల వర్షాలతో ఉమ్మడి నల్గొండ వ్యాప్తంగా రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. వరి, పత్తి పంటలు పెద్ద ఎత్తున దెబ్బతిన్నాయని తెలిపారు. మొంథా తూఫాన్ హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం పై పంజా విసిరింది. రాష్ట్రం లోనే అత్యధికంగా బుధవారం 41.2 సెం.మీ. వర్షపాతం నమోదైంది. దీంతో భీమదేవరపల్లి మండలంలోని చెరువులు, వాగులు, వంకలు పొంగి పొర్లాయి. దాదాపు గ్రామాల్లోని అన్ని చెరువులు, కుంటలు నిండుకు న్నాయి. దశాబ్దాల క్రితం వరకు కూడా ముత్తారం చెరువు నిండ లేదని, ఇప్పుడే చెరువు నిండి మత్తడి పోస్తుందని గ్రామస్తులు చెబుతున్నారు. కొత్తపల్లిలో చెరువు తెగడంతో పోలీసులు, అధికారులు సహాయ సహకారాలు అందించారు. కాగా కొత్తకొండ చెరువు పెద్ద ఎత్తున మత్తడి పోయడంతో, చెరువు కట్ట తెగిపోయే ప్రమాదం ఉ ందని అధికారులు పర్యవేక్షిస్తున్నారు. చేతికొచ్చిన మరి పంట నీట మునిగిందని, కోసిన వరి ధాన్యం తడిసి ముద్దయిందని చాలా చోట్ల రైతులు కన్నీరు పెట్టుకున్నారు. మండలంలో సుమారు 6030 ఎకరాలు వరి పంట దెబ్బతిందని, 3290 మంది రైతులు రోడ్డున పడ్డారని వ్యవసాయ అధికారుల అంచనా. కొత్తకొండ గట్లనర్సింగాపూర్, కొత్తకొండ మల్లారం గ్రామాల్లో ప్రధాన రహదారులు తెగిపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. యాభై ఏండ్ల తరువాత ఇంత స్థాయిలో వర్షం పడిందని స్థానికులు చెబుతున్నారు. బొల్లోనిపల్లి గ్రామం జలదిగ్బంధంలో ఉంది. దాదాపు 25 కుటుంబాల్లో ఇళ్లలోకి నీరు పెద్ద ఎత్తున చేరుకోవడంతో ప్రమాదం ఏర్పడింది. దీంతో పోలీసులు, రెవెన్యూ అధికారులు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం, ప్రభుత్వ పాఠశాలలో పునరావాసం కల్పించారు. తుఫాన్ దాటికి మండలంలో రెండు ట్రాన్స్‌పార్మర్స్, 26 విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నట్లు విద్యుత్ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. కొప్పూరులో ఒక ఆవు, రెండు దూడలు, మల్లారం గ్రామంలో రెండు ఆవులు మృతి చెందాయి. మండలంలోని 94 చెరువులు, కుంటలు ప్రమాదంలో ఉన్నట్లు రెవెన్యూ అధికారులు భావిస్తున్నారు. తిమ్మాపూర్ మండలంలోని రామకృష్ణ కాలనీ శివారులో కుంట కింద ఏర్పాటు చేసిన వెంచర్ వల్ల రైతుల పంట పొలాలు నీట మునిగాయి. వెంచర్ ఏర్పాటు చేసిన తర్వాత కుంట మత్తడి వెళ్లేందుకు చిన్న మోరీ లాగా ఏర్పాటు చేశారు. అయితే బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షంతో వచ్చిన వరద వెళ్లేందుకు మార్గం లేకపోవడంతో సమీప పొలాలన్నీ మునిగిపోయాయి. దీంతో తీవ్ర స్థాయిలో నష్టం వాటిల్లినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తిమ్మాపూర్ నుంచి పోరండ్ల, వచ్చునూర్ నుంచి జోగుండ్ల, పోలంపల్లి నుంచి మొగిలిపాలెం వెళ్లే రోడ్లలో వచ్చే వరద కల్వర్టుల వద్ద భారీగా వస్తున్నడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో హై లెవెల్ వంతెనలు ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# మేఘమథనం.. ఢిల్లీ వ్యర్థ ప్రయత్నం



న్యూఢిల్లీ,దేశ రాజధాని ఢిల్లీ నగరాన్ని పట్టిపీడిస్తున్న వాయు కాలుష్యాన్ని అరికట్టడానికి ఢిల్లీ బిజెపి ప్రభుత్వం చేపట్టిన మేఘమథనం (క్లౌడ్ సీడింగ్) అట్టర్ ఫ్లాప్ అయిన సంగతి తెలిసిందే. బుధవారం(29.10.25) ఉదయం ఐఐటి కాన్పూర్ సహకారంతో ఢిల్లీలోని బురారి, ఉత్తర కరోల్‌బాగ్, మయూర్ విహార్, బద్లి తదితరప్రాంతాల్లో క్లౌడ్ సీడింగ్ ట్రయల్స్ నిర్వహించారు. కాన్పూర్ ఐఐటి నుంచి ప్రయోగ విమానం బయలుదేరి 6000 అడుగుల ఎత్తులో రసాయనాలు వెదజల్లినా ఫలితం దక్కలేదు. ఈ ప్రక్రియ పూర్తయి నాలుగు గంటలైనా వర్షాలు కురవలేదు. గత ఆమ్‌ఆద్మీ ప్రభుత్వం 2023లో ఢిల్లీలో పొగమంచు సీజన్‌లో మేఘమథనం చేపట్టాలని ప్రయత్నించినా వాతావరణం అనుకూలించక విరమించుకుంది. 2024 లో కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖ ఢిల్లీ వాయునాణ్యతను అత్యవసరంగా మెరుగుపర్చడానికి మేఘమథనం ఆచరణ సాధ్యం కాదని పార్లమెంట్‌కు వెల్లడించడం ఈ సందర్భంగా గమనార్హం.లాహోర్, బ్యాంకాక్, కౌలాలంపూర్, బీజింగ్ తదితర ప్రపంచం లోని అనేక నగరాల్లో మేఘమథనం ప్రయోగాలు నిర్వహించినా అనుకున్న లక్షాలు సాధించలేక దీన్ని విడిచిపెట్టారు. ఈ నేపథ్యంలో ఢిల్లీ ప్రభుత్వం ఎంతో వ్యయంతో ఈ ప్రయోగాన్ని చేపట్టడం వ్యర్థ ప్రయత్నమే తప్ప ఏమాత్రం ఉపయోగం జరగలేదు. ఆకాశంలో మేఘాలు దట్టంగా ఆవరించి ఉన్నప్పుడే మేఘమథనం పనిచేస్తుంది తప్ప స్వయం సహజ సిద్ధంగా వర్షాన్ని అందించదు. అందువల్ల పొడిగాలులు లేని శీతాకాలంలో కాకుండా వర్షాకాలం లోనే దీన్ని వినియోగిస్తారు. 2023 లో లాహోర్‌లో మేఘమథనం వల్ల కొద్దిసేపు కురిసిన వర్షం గాలి నాణ్యతను మెరుగుపర్చినా, కొన్ని గంటలకే పరిమితమైంది. ఆ తరువాత పరిస్థితి మళ్లీ మామూలే అయింది. ఈ కారణంగా ప్రపంచం లోని చాలా దేశాలు మేఘమథనాన్ని నమ్ముకోవడం లేదు. అత్యవసరంగా వాయు కాలుష్యాన్ని నియంత్రించవలసి వచ్చినా దీని గురించి ఆలోచించడం లేదు. ప్రభుత్వాలకు ఈ వాస్తవాలు తెలిసినవే. బిజెపి ప్రభుత్వానికి కూడా ఈ సంగతి తెలిసినా ఎందుకు మేఘమథనం చేపట్టిందో అర్థంకావడం లేదు. శీతాకాలంలో మేఘాలు చాలావరకు పశ్చిమ వైపు అలజడులనుంచి ఉత్తరాదికి వ్యాపిస్తుంటాయి. అవి స్వల్పకాలమే ఉన్నా అప్పటికే సహజంగా వర్షాలను తీసుకొస్తాయి. అందువల్ల మేఘమథనం అవసరం ఉండదు. ఎయిర్‌క్రాఫ్ట్ పరిమితుల బట్టి 5 6 కి.మీ మించి ఎక్కువ ఎత్తులో ఉన్న మేఘాలు మేఘమథనానికి వీలుపడవు. మేఘమథనం సరిగ్గా, సమర్థవంతంగా జరగాలంటే ఆకాశం దట్టమైన మేఘాలతో, అనుకూల వాతావరణంతో ఉండాలి. ఢిల్లీలో శీతాకాలం నాడు అలాంటి వాతావరణం కనిపించదు. వర్షం జల్లులు కురియడానికి సిద్ధంగా ఉన్నా అవి నేలపై రాలడానికి ముందే మేఘాల కింద ఉన్న పొడిగాలి వాటిని ఆవిరిగా దహించేస్తుంది. మరో ముఖ్యమైన విషయం మేఘమథనానికి ఉపయోగించే రసాయనాల సామర్థం విషయంలో ఆందోళన నెలకొంటోంది. ఊహించని పర్యవసానాలు ఎదురవుతున్నాయి. సూక్ష్మం గా చెప్పాలంటే అవి ఏమాత్రం పనిచేయవు. ఈ విధంగా నిరాశపరిచే ఈ ప్రయోగం కోసం ఢిల్లీ ప్రభుత్వం ఎందుకు ప్రయత్నిస్తోంది? దీనికి సమాధానం ఢిల్లీ ప్రభుత్వ బిజెపి వర్గాల్లోనే ఉంది. గత ఆప్ ప్రభుత్వం 2023లో చేయలేకపోయిందని, ఇప్పుడు తాము చేసి చూపిస్తామని బిజెపి ప్రభుత్వం పంతం పెట్టుకుంది. ఇది సైన్స్ గురించి తగిన పరిజ్ఞానం లేక, రాజకీయంగా సాధించాలన్న ఆలోచన తప్ప మరేం కాదని తెలుస్తోంది. ఐఐటి కాన్పూర్ ఇందులోకి తనకు తాను ప్రవేశించి అన్నివర్గాలను ఆకర్షించుకోవడానికి ప్రయత్నిస్తోంది. భారత్ మొట్టమొదట 1950 లో ఈ ప్రయోగాన్ని నిర్వహించింది. దీనిపై ఇంకా పరిశోధనలు కొనసాగుతున్నాయి. ఇటీవల ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ మెయిటొరాలజీ నేతృత్వంలో పశ్చిమ కనుమల్లో మేఘమథనం జరిగింది. థాయ్‌లాండ్‌లో కృత్రిమ వర్షపాతం సృష్టించేందుకు డిపార్టుమెంట్ ఆఫ్ రాయల్ రెయిన్ మేకింగ్, అండ్ అగ్రికల్చరల్ ఏవియేషన్ అనే ప్రత్యేక విభాగమే ఉంది. ప్రపంచం లో చైనా, అమెరికా దేశాలు భారీ ఎత్తున వాతావరణ మార్పు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రత్యేకంగా వర్షాకాలంలో దుర్భిక్ష నివారణకోసం ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నాయి. కానీ వాతావరణంలో కాలుష్యాన్ని తగ్గించే మార్గాల్లో మేఘమథనం కూడా ఒకటిగా అనుసరిస్తున్నారు. ఢిల్లీలోని వాయు కాలుష్యాన్ని, అలాగే యమునా నది జల కాలుష్యాన్ని శ్రీఘ్రగతిలో పరిష్కరిస్తామని బిజెపి గత కొన్నేళ్లుగా వాగ్దానాలు చేస్తోంది. యమునా నది కాలుష్యంపై ఆప్ ప్రభుత్వ కాలంలో ఎన్నో వివాదాలు, సవాళు చెలరేగిన సంగతి తెలిసిందే. పర్యావరణ సమస్యల పరిష్కారానికి దగ్గరి మార్గాలంటూ ఏవీ లేవు. ప్రపంచంలో ఎక్కడైనా, క్రమబద్ధమైన, శాస్త్రీయ, వైజ్ఞానిక, సాంకేతిక, పద్ధతులు, పాలకవర్గాల జవాబుదారీతనం, దీర్ఘకాలిక ప్రణాళికల అమలు వంటి చర్యలతోనే పర్యావరణ పురోగతి ఆధారపడి ఉ ంటుందని నిపుణులు చెబుతున్నారు. ఇవన్నీ విస్మరించి కేవలం రాజకీయ ప్రాబల్యంతో వాస్తవాలను పక్కనపెట్టి అప్పటికప్పుడు నిర్ణయాలతో ఏదీ సాధ్యం కాదు. ఈ పాఠాన్ని ఢిల్లీ బిజెపి ప్రభుత్వం వంట పట్టించుకోవడం తప్పనిసరి. ప్రయోగాలు, ఆవిష్కరణలకు వాటి స్థానం వాటికి ఉంటుంది తప్ప ఆవిష్కరణలు, రాజకీయ సిద్ధాంత భావజాలాన్ని భర్తీ చేయలేవు. మనం పటిష్టమైన మౌలిక సదుపాయాలను, వ్యవస్థలను ముందుచూపుతో నిర్మించుకోలేకుంటే ఆకాశం, ప్రకృతి వనరులు, నదులు, పర్వతాలు ఇవన్నీ కలుషితమవుతూనే ఉంటూ మనం మాత్రం పురోగతి అనే భ్రమలో చిక్కుకుపోతుంటాం.

# ప్రజలు కష్టాల్లో ఉంటే అబద్దాలు ప్రచారమా

విజయవాడ,రాష్ట్ర ప్రజలు కష్టాల్లో ఉంటే.. గదిలో కూర్చొని జగన్ అబద్దాలు ప్రచారం చేస్తున్నారని ఏపీ వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు విమర్శించారు. ఐదేళ్లపాటు ముఖ్యమంత్రిగా చేసిన వ్యక్తి.. సిగ్గులేకుండా అబద్దాలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. మొంథా తుపాను నేపథ్యంలో కృష్ణా జిల్లా పెనమలూరు, వెంట్రుపగడలో మంత్రి పర్యటించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. గత ఐదు రోజులుగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నా.. కేవలం విమానం లేదన్న సాకుతో బెంగళూరు నుంచి రాని వ్యక్తి.. గదిలో కూర్చొని విష ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. పంటల బీమాపై జగన్ పచ్చి అబద్ధాలు చెబుతున్నారు. దమ్ముంటే టెలీకాన్ఫరెన్స్‌లో చేసిన వ్యాఖ్యలపై జగన్ చర్చకు రావాలి. వాస్తవ నివేదికలతో మేం కూడా చర్చకు వస్తాం. గత ప్రభుత్వం 40? కూడా చేయని ఈ-క్రాప్‌ను మేం 95శాతం చేశాం. మామిడికి కేజీకి రూ.4 ఇచ్చి రూ.300 కోట్లు ఖర్చు పెడితే.. మామిడి రైతులను పట్టించుకోలేదని దుర్మార్గపు మాటలు మాట్లాడుతున్నారు. గత వైకాపా ప్రభుత్వంలో రాష్ట్ర ప్రభుత్వ బీమా వాటా చెల్లించలేదని సాక్షాత్తు అప్పటి కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి

# ఒంగోలు పట్టణ వ్యాపారుల లబోదిబో

ఒంగోలు,మొంథా తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలు ఉమ్మడి ప్రకాశం జిల్లాను అతలాకుతలం చేశాయి. అన్నదాతలతో పాటు, సామాన్యులు కూడా దెబ్బతిన్నారు. ముఖ్యంగా వీధి వ్యాపారుల అవస్థలు చెప్పలేం. ఒక్కొక్కరిదీ ఒక్కో దీనగాథగా ఉంది. చిరు వ్యాపారులను తుఫాన్ వర్షం నిలువునా ముంచింది. జిల్లా కేంద్రం ఒంగోలు నగరంలో ఊహించని విధంగా భారీఎత్తున వరద నీరు ముంచెత్తడంతో తీవ్ర నష్టం వాటిల్లింది. కిరణా సామగ్రి విక్రయదారులు, దర్జీలు, తినుబండరాలు అమ్మేవారు, మోటారు మెకానిక్‌లు ఇలా చేతివృత్తులదారులందరూ తీవ్రంగా నష్టపోయారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని వారంతా విజ్ఞప్తి చేస్తున్నారు. అల్పపీడనం, అనంతరం మొంథా తుపాను ప్రభావంతో గత పది రోజులుగా కురిసిన భారీ వర్షాలతో వ్యాపారాలు అంతంతమాత్రంగా సాగాయి. వర్షాలకు జన సంచారం తగ్గి అమ్మకాలు సాగక చిరు వ్యాపారులకు పూట గడవని పరిస్థితి నెలకొంది. తొలుత ఎలాంటి వరద లేకపోవడంతో ఎప్పుడూ వచ్చే మాదిరి వరద నీరు వచ్చి పోతుందని పెద్దగా జాగ్రత్తలు తీసుకోలేదు. చాలామంది సామగ్రి సర్దుకోలేదు. చాలామంది దుకాణం ఒకచోట, నివాసం మరోచోట ఉండటంతో సామగ్రిని భద్రపరచుకోలేకపోయారు. భారీఎత్తున వరద నీరు చుట్టుముట్టేయడంతో దుకాణాల్లో నీరు చేరింది. దీంతో సామగ్రి పూర్తిగా తడిసిపోయి ఎందుకూ పనికిరాకుండాపోయాయి. వరదతో దుకాణంలో బురద మేటలు వేసిందని, దీంతో తీవ్రంగా నష్టపోయినట్లు వివరించారు. వస్తువులను తయారు చేసే చిన్న ఖార్ఖానాలను వరద నీరు ముంచెత్తడంతో వారంతా నష్టపోయారు. ప్రధానంగా ఒంగోలు నగరంలోని పోతురాజు కాలువను ఆనుకుని ఉన్న కాలనీల్లో చిరు వర్తకులకు తీవ్ర నష్టం ఎదురైంది. నష్టాన్ని పరిశీలించి తమకు సాయం చేయాలని వారంతా కోరుతున్నారు. ఒంగోలు నగరం మెంథా దెబ్బకు జలవిలయాన్ని సృష్టించంది. నగరం మొత్తం నీట మునిగింది. దీంతో చిన్నాచితక వ్యాపారాలు చేసేవారి సామాగ్రి నీట మునిగిపోవడం లేదా కొట్టుకుపోవడం జరిగింది. బలరాం కాలనీకి వెళ్లే దారిలో వంతెన వద్ద సమోసాలు హోల్‌సేల్‌గా విక్రయించే దుకాణంలో పిండి బస్తాలు తడిచిముద్దయి పనికి రాకుండాపోయాయి. ఇదే ప్రాంతంలో పాత సామగ్రి కొనుగోలు దుకాణంలోని మొత్తం సరకు కొట్టుకుపోయినట్లు వ్యాపారి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడు వర్షం కురిసినా మోకాలి లోతున నీళ్లు వస్తుంటాయని, ఆమేర జాగ్రత్త పడతామని ఈసారి ఊహించని విధంగా వరద ముంచేసిందని ఓ కిరాణా వ్యాపారి వాపోయారు. ఇటీవల కాలంలో ఇంత వరద తామెప్పుడూ చూడలేదని పలువురు కన్నీటిపర్యంతమయ్యారు.

# ఈ గండం గట్టెక్కాలి

హైదరాబాద్,జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నాయకత్వానికి అగ్నిపరీక్షగా మారింది. పార్టీ అధినేత కేసీఆర్ ప్రచారానికి దూరంగా ఉంటున్నారు. సీనియర్ నేత హరీశ్ రావు తండ్రి మరణించడంతో ఆయన అనూహ్యంగా ప్రచారానికి దూరమయ్యారు. దీంతో పార్టీ గెలుపు బాధ్యత మొత్తం కేటీఆర్ పై పడింది. పదేళ్లు అధికారంలో కొనసాగిన పార్టీ.. గత రెండేళ్లుగా తీవ్రమైన సవాళ్లను ఎదుర్కొంటోంది. ఒకవైపు అధికారపార్టీ అన్నివిధాలుగా పైచేయి సాధించడానికి ప్రయత్నించడం, మరోవైపు నుంచి తమ స్థానాన్ని లాక్కోవాలని బీజేపీ ప్రయత్నాలు చేస్తున్న సమయంలో జూబ్లీహిల్స్ స్థానాన్ని నిలబెట్టుకోవడం బీఆర్ఎస్ వర్కింగు ప్రెసిడెంటుగా కేటీఆర్ కు అత్యంత ప్రధానమంటున్నారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానం బీఆర్ఎస్ సిట్టింగ్ స్థానం. పదేళ్లుగా ఇక్కడ కారు పార్టీకి ఎదురులేకుండా ఉంది. ఎమ్మెల్యే గోపీనాథ్ మరణంతో అనూహ్యంగా వచ్చిన ఉప ఎన్నికలో మళ్లీ గెలవడం బీఆర్ఎస్ కు అత్యావసరం అంటున్నారు. ఈ స్థానంలో గెలవడం వల్ల పార్టీకి ఒనగూరే ప్రయోజనం పెద్దగా ఏమీ లేకపోయినా, రిజల్ట్ తేడా వస్తే జరిగే నష్టం మాత్రం చాలా ఎక్కువగానే ఉండే అవకాశం ఉంది. అధినేత కేసీఆర్ గైర్హాజరు, సీనియర్ నేత హరీశ్ రావు రాలేని పరిస్థితుల్లో ఫలితం ఎలా ఉన్నా, దానికి కేటీఆర్ బాధ్యత వహించాల్సివున్నందున జూబ్లీహిల్స్ గెలిపించడం ఆయన భవిష్యత్తుకు కీలకంగా చెబుతున్నారు. పార్టీలో నెంబర్ టు గా ఉన్న కేటీఆర్.. కొద్దిరోజుల్లోనే నెంబరు వన్ స్థానాన్ని అందుకోవాలని చూస్తున్నారు. ఈ స్థానం కోసం పోటీపడిన చెల్లి కవిత.. ఆ స్థానం దక్కదనే ఆలోచనతో ఇప్పటికే తప్పుకున్నారు. ఇక కేటీఆర్ కు పోటీగా భావిస్తున్న ఇతర నేతలు కూడా ప్రస్తుతం సైలెంటుగానే ఉన్నారు. మరోవైపు తండ్రి, బీఆర్ఎస్ అధినేత సైతం కేటీఆర్ కు పూర్తి బాధ్యతలు అప్పగించేందుకు తగిన సమయం కోసం ఎదురుచూస్తున్నట్లు చెబుతున్నారు. రెండేళ్ల క్రితం అధికారం కోల్పోవడంతో అధ్యక్ష పదవిని కేటీఆర్ కు అప్పగించడానికి కేసీఆర్ వెనక్కి తగ్గారని అంటున్నారు. ప్రతిపక్షంలో బాధ్యతలు బదిలీ చేయడం తగిన సమయం కాదన్న ఆలోచనతోనే అధినేత కొంత సమయం తీసుకోవాలని నిర్ణయించారని చెబుతున్నారు. ఇదే సమయంలో పార్టీ ప్రతిపక్షంలోకి వచ్చిన నుంచి మొత్తం బాధ్యతలు కేటీఆర్ కే అప్పగించారు. గత రెండేళ్లుగా పార్టీ కార్యక్రమాలు అన్ని కేటీఆర్ పర్యవేక్షణలోనే జరుగుతున్నాయి. కేసీఆర్ ఎక్కడా కనిపించడం లేదు. ఎర్రవెల్లి ఫాం హౌస్ కే పరిమితమైన అధినేత అప్పుడప్పుడు పార్టీ నేతలకు దిశానిర్దేశం చేస్తున్నారు. అవసరమైన సలహాలు, సూచనలకే పరిమితమవుతున్నారు. ఈ నేపథ్యంలో జూబ్లీహిల్స్ ఫలితం ఎలా ఉన్నా అందుకు కారణం కేటీఆర్ అవుతారని అంటున్నారు. ప్రస్తుతం ప్రచారం మొత్తం తన భుజస్కందాలపై వేసుకున్న కేటీఆర్.. అధికార పార్టీ కాంగ్రెస్ కు దీటుగా దూసుకుపోతున్నారు. అయితే ఎట్టిపరిస్థితుల్లోనూ జూబ్లీహిల్స్ తన్నుకుపోవాలని అధికార కాంగ్రెస్ చేస్తున్న ప్రయత్నాలు రాజకీయాన్ని వేడిక్కిస్తున్నాయి. సీఎం రేవంత్ తోపాటు మంత్రులు మొత్తం జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో మోహరించి, క్షేత్రస్థాయిలో పనిచేయాలని నిర్ణయించడం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ను ఒత్తిడికి గురిచేస్తోందని అంటున్నారు. ఈ పరిస్థితుల్లో అధికార పార్టీ వ్యూహాలకు ప్రతివ్యూహాలు రచించి, పార్టీ అభ్యర్థి సునీతను గెలపించడం కేటీఆర్ కు కత్తిమీద సాములా మారిందని అంటున్నారు. ప్రతికూల పరిస్థితుల్లో నెగ్గుకురావడం అంటే చిన్నవిషయమే కాదన్న అభిప్రాయం ఉంది. ప్రస్తుతం కాంగ్రెస్, బీజేపీలకు రకరకాల సానుకూలతలు కనిపిస్తున్నాయి. ప్రధానంగా ఆ రెండు పార్టీలకు అధికారం అనే బలం అదనపు అడ్వాంటేజ్ గా మారింది. కానీ, బీఆర్ఎస్ పార్టీ అన్నిరకాలుగా ఎదురీదాల్సివస్తోంది. ఇలాంటి సమయంలో పార్టీని గెలిపించి తన భవిష్యత్తును కేటీఆర్ ఎలా తీర్చిదిద్దుకుంటారో చూడాల్సివుందని అంటున్నారు.

## ఓయూ డిగ్రీ పరీక్షల తేదీల ఖరారు

హైదరాబాద్,ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని అన్ని డిగ్రీ కోర్సుల పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకామ్, బీఎస్‌డబ్ల్యూ, బీఎస్సీ, బీబీఏ, బీబీఏ అనాలిటిక్స్, బీబీఏ ఫ్యాషన్ మేనేజ్‌మెంట్, బీబీఏ ఫ్యాషన్ డిజైన్ మేనేజ్‌మెంట్, బీబీఏ రిటైల్ మేనేజ్‌మెంట్ తదితర కోర్సుల మూడు, అయిదో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను వచ్చే నెల 12వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ లో చూసుకోవచ్చని సూచించారు.

## మా రెండేళ్ల పాలన గురించి కాదు

హైదరాబాద్, రెండేళ్లలో కాంగ్రెస్ ఏం చేసిందని కేటీఆర్ అంటున్నారు.. పదేళ్ల అధికారంలో ఉండి ఏం చేశారో కేటీఆర్ చెప్పాలని మంత్రి వివేక్ అన్నారు. బీఆర్ఎస్ రాజకీయ కుట్రతో కాంగ్రెస్ ను బద్నాం చేసే ప్రయత్నం చేస్తోందని అన్నారు. గురువారం జూబ్లీహిల్స్ పరిధిలోని షేక్ పేట్ డివిజన్ లో ఎన్నికల ప్రచారంలో మంత్రి వివేక్ వెంకటస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... బీఆర్ఎస్ పార్టీపై ఘాటైన వ్యాఖ్యలు చేశారు. పేదల పక్షాన నిలబడే వ్యక్తికి కాబట్టే అధిష్ఠానం తనను ఇంచార్జిగా నియమించిందని అన్నారు. షేక్ పేట్ డివిజన్ అభివృద్ధి చెందలేదంటే పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ను ప్రశ్నించాలని అన్నారు మంత్రి వివేక్. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇస్తామని కేసీఆర్ మోసం చేశారని... పదేళ్లలో ఎన్ని డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇచ్చారో చెప్పాలని అన్నారు. షేక్ పేట్ డివిజన్ లో చాలా సమస్యలు ఉన్నాయని.. పదేళ్లలో బీఆర్ఎస్ పట్టించుకోలేదని మండిపడ్డారు. ముస్లిం మైనారిటీ నుండి గతంలో మహమూద్ అలీ మంత్రిగా పని చేసారని.. ఆయన ముస్లిం సమాజానికి ఏం చేయలేదని అన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ అజారుద్దీన్ ని మంత్రి చేస్తోంది.. ఎమ్మెల్సీగా ముస్లిం మైనారిటీ వ్యక్తికి అవకాశం ఇస్తే బీఆర్ఎస్ అడ్డుకున్నారని అన్నారు మంత్రి వివేక్. బీఆర్ఎస్, బీజేపీ రెండు ఒక్కటేనని.. బీఆర్ఎస్ కు ఓటేస్తే.. బీజేపీకి వేసినట్లేనని అన్నారు. ఇంకా మూడేళ్ళ పాటు కాంగ్రెస్ అధికారంలో ఉంటుందని.. కాంగ్రెస్ వల్లే ఇక్కడ అభివృద్ధి జరుగుతుందని అన్నారు. యువతకు ఉద్యోగాలు ఇస్తామని బీఆర్ఎస్ గతంలో హామీ ఇచ్చి మోసం చేసిందని అన్నారు మంత్రి వివేక్. 28 రాష్ట్రాల్లో దొడ్డు బియ్యం ఇస్తున్నారని.. సన్న బియ్యం ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ, కాంగ్రెస్ ప్రభుత్వమని అన్నారు.జూబ్లీ హిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అన్నారు మంత్రి వివేక్.

## శ్రీశైలంలో టిటిడి వసతి సమాదాయానికి వినతి

తిరుమల,టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్ ను శ్రీశైలం చైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు గురువారం కలిశారు. తిరుమలలో జరిగిన ఈ భేటీలో స్వామివారి వస్త్రము, ప్రసాదం అందజేసి దోర్నాల దగ్గర భక్తులు, యాత్రికుల కోసం టీటీడీ వసతి సముదాయం, ధార్మికత నిర్మించాలని కోరారు. అలాగే శ్రీశైలంలో కూడా టీటీడీ వసతి సముదాయాన్ని నిర్మించాలని ఈవో అనిల్ కుమార్ సింఘాల్ కు వినతి పత్రం ఇచ్చారు. ఈ క్రమంలో టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్ సానుకూలంగా స్పందించారు.. టీటీడీ తరపున బోర్డు మెంబర్ భాను ప్రకాష్ రెడ్డిని శ్రీశైలం వెళ్లి ఎన్ని గదులు అవసరం అవుతాయి పరిశీలించి టీటీడీ సమాచారం ఇవ్వాలని ఆదేశించినట్లు తెలిపారు. పదిరోజుల్లో శ్రీశైలం దర్శనానికి వచ్చి వసతి సముదాయాల గురించి పరిశీలించి పూర్తిస్థాయిలో నివేదిక ఇస్తామని చెప్పారని అన్నారు రమేష్ నాయుడు. అడిగిన వెంటనే ఈవో అనిల్ కుమార్ సింఘాల్ సానుకూలంగా స్పందించి ఖచ్చితంగా వసతి గదుల సముదాయం నిర్మిస్తామని చెప్పినందుకు వారికి ప్రత్యేక కృతజ్ఞతలు అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోతో పాటు టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు.

## ప్రభుత్వాసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యం

మహబూబాబాద్, వైద్యం కోసం వచ్చిన రోగిని ఆధార్ కార్డు లేదనే నెపంతో ఆసుపత్రిలో చేర్చుకునేందుకు ఆసుపత్రి సిబ్బంది అంగీకరించలేదు. ఆసుపత్రి ఆవరణలో రోగి.. వైద్యం కోసం రెండు రోజుల పాటు పడిగాపులు కాస్తూ నిరీక్షించి నీరసించడంతో సిబ్బంది మృతి చెందాడనే అనుమానంతో మార్చురీలో భద్రపరిచిన అమానవీయ సంఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని జిల్లా ఆసుపత్రిలో చోటుచేసుకుంది. చిన్న గూడూరు మండలం జయ్యారం గ్రామానికి చెందిన వి.రవి మూత్ర పిండాల వ్యాధితో ఇబ్బంది పడుతూ మూడు రోజుల క్రితం జిల్లా ఆసుపత్రికి వైద్యం కోసం వచ్చాడు. రోగికి తోడుగా ఎవ్వరు ఉండక పోవడంతో పాటు ఆధార్ కార్డు లేకపోవడంతో ఆసుపత్రిలో చేర్చుకోవడానికి వైద్య సిబ్బంది నిరాకరించారు. దీంతో రోగి 2 రోజుల పాటు ఆస్పత్రి ఆవరణలో పడిగాపులు పడి.. నీరసించి ఆ చేతనంగా మారిపోయాడు. రోగి మృతి చెందాడనే అనుమానంతో వైద్య సిబ్బంది ఆసుపత్రిలోని మార్చ్యారికి తరలించి భద్ర పరిచారు. మరుసటి రోజు మార్చురిని శుభ్ర పరచడానికి వచ్చిన స్వీపర్లు.... రోగి కదలికలను గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఆసుపత్రికి చేరుకుని రోగిని వైద్యం చేయిస్తున్నారు. ఆసుపత్రిలో ఇంత దారుణం జరిగినా ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. వైద్యం కోసం ఆస్పత్రికి వచ్చిన రోగి పట్ల ఆసుపత్రి సిబ్బంది వ్యవహరించిన తీరు.. మానవత్వం మంటగలిపారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## సంచలన హామీలు ..

పాట్నా:బిహార్ ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి దిశగా సమగ్ర ప్రణాళికను సిద్ధం చేసింది. ప్రతి వర్గానికి ప్రాధాన్యతనిస్తూ రైతులు, యువత, మహిళలు, కులవృత్తుల అభివృద్ధి కోసం పలు కొత్త పథకాలు అమలు చేయనుంది.

రైతుల కోసం పెరిగిన పెట్టుబడి సాయం

ప్రస్తుతం రైతులకు అందిస్తున్న రూ.6 వేల కర్పూరి ఠాకూర్ కిసాన్ సమ్మాన్ నిధిను రూ.9 వేలకు పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పథకం కింద రైతులు సంవత్సరానికి మూడు విడతలుగా సాయం పొందుతారు. పెరుగుతున్న ఎరువులు, విత్తనాలు, డీజిల్ ధరల మధ్య రైతులకు ఈ ఆర్థిక సాయం ఉపశమనం కలిగిస్తుంది.

యువతకు కోటి ఉద్యోగాలు

రాష్ట్రంలోనినిరుద్యోగ యువతకు అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కోటి ఉద్యోగాల సృష్టి లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం పరిశ్రమల ప్రోత్సాహం, ఐటీ పార్కులు, స్టార్టప్ ప్రోత్సాహక కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. కొత్తగా ఏర్పడే తయారీ యూనిట్లు, రోడ్డు, రైల్వే ప్రాజెక్టుల్లో స్థానిక యువతకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు.

మహిళల ఆర్థిక శక్తివంతం

“ముఖ్యమంత్రి మహిళా రోజ్‌గార్ యోజన” కింద ప్రభుత్వం కోటి మహిళలను లక్షాధికారులుగా తీర్చిదిద్దే లక్ష్యాన్ని ప్రకటించింది. ఈ పథకం ద్వారా మహిళలకు చిన్న వ్యాపార రుణాలు, నైపుణ్య శిక్షణ, మార్కెట్ లింకేజీ, డిజిటల్ ట్రాన్సాక్షన్ అవగాహన కల్పించనున్నారు. మహిళా స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేయనున్నారు.

ఈబీసీలకు రూ.10 లక్షల సాయం

ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకులవృత్తులను ప్రోత్సహించేందుకు ప్రతి కుటుంబానికి రూ.10 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించనున్నారు. సంప్రదాయ వృత్తులను ఆధునిక పద్ధతులతో అనుసంధానం చేసి, స్థిరమైన ఆదాయ వనరులు కల్పించడమే లక్ష్యం.

ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి –రోడ్లు, రైళ్లు, మెట్రో, విమాన సర్వీసులు

బిహార్‌లో రవాణా రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చే దిశగా ప్రభుత్వం

# బయటకు వచ్చే వారి ప్రణాళిక?



హైదరాబాద్,అడవులలోని నక్సలైట్లు విడతలు విడతలుగా మైదాన ప్రాంతంలోకి రావటం మొదలైంది. ఆ విధంగా ఇప్పటికే వచ్చిన వివిధ స్థాయిల నాయకులు, దళ సభ్యులు కొన్ని వందల మంది ఉన్నారు. అడవులలో ఇంకా మిగిలిన వారి సంఖ్య ఎంతైనదీ నిర్దిష్టంగా తెలియదు. ఇదంతా మధ్య భారత ప్రాంతపు విషయం. ఇది కాకుండా తూర్పు రాష్ట్రాలకు వెళ్లే కొద్దీ పరిస్థితులు ఏమిటన్న వార్తలు లేవు. దేశం లో నక్సలైట్లను లేదా నక్సలిజాన్ని 2026 మార్చి చివరి నాటికి పూర్తిగా తుడిచి పెట్టగలమన్న కేంద్ర హెూం మంత్రి అమిత్ షా గడువుకు ఇంకా సరిగా అయిదు నెలల గడువుంది. ఆ ప్రకారం ఆయన ప్రకటన నెరవేరుతుందా లేదా అనేది అట్లుంచి, ఈలోగా నక్సలైట్లు ఏమి చేయవచ్చునన్నది ఒక ప్రశ్న అవుతున్నది. ఇదే పద్ధతిలో మరింతమంది బయటకు రాచ్చునా? అందరూ రాగలరా? కొందరు వచ్చి కొందరు మిగులుతారా? అనే విషయాల గురించి వేచి చూడవలసిందే గాని, ముందుగా ఎవరూ చెప్పలేరు. ప్రపంచ వ్యాప్తంగా ఇటువంటి విప్లవోద్యమాల దశలను గమనించినపుడు ఇది అర్థమవుతుంది. మరొక కీలకమైన ప్రశ్న నక్సలైట్లును అంతం చేసినా ఆ భావజాలం పోతుందా అన్నది.ఆ విషయం అట్లుంచితే, ఇక్కడ ప్రస్తుతం బయటకు వస్తున్న వారి సంఖ్య మొత్తంగా కలిపి పెద్దదే. వారి భవిష్యత్తు ప్రణాళిక ఏమి కావచ్చును? బయటకు రావటం లోగడ కూడా జరిగింది. కాని ఒకటీ అరగా. అందువల్ల వారేమి చేయవచ్చుననే ప్రశ్న రాలేదు. తమ వ్యక్తిగత స్థాయిలోనో, కుటుంబపరంగానో తప్ప. ఎవరి పద్ధతిలో వారు స్థిరపడిపోయారు. బయట చట్టబద్ధంగా పని చేస్తున్న కమ్యూనిస్టు పార్టీలలో చేరిన వారు ఉన్నారు. కొందరు కాంగ్రెస్, బిఆర్ఎస్ వంటి పార్టీలలో చేరారు. బిజెపి గురించి తెలియదు. ఈసారి సంఖ్య వందలలో ఉండటం, కొందరు ముఖ్యులు కూడా కావటం వల్ల ఈ ప్రశ్నలు ముందుకు వస్తున్నాయి. మీరు కూడా ఇంతకు ముందటి వారి వలెనే వ్యవహరించవచ్చునా? లేక అందుకు భిన్నంగా ఏమైనా చేయవచ్చునా? పౌరహక్కుల సంఘం బాధ్యడొకరు ఈ సందర్భంగా మాట్లాడుతూ, వాళ్లు బయటకు వస్తున్నారు గాని ఏం చేసేదీ చెప్పటం లేదన్నారు. ఆ మాటను ఆయన వారిని సవాలు చేయటం, వారి ‘నిజ స్వరూప’మని తాను భావించే దానిని ‘బహిరంగ’ పరచటం అనే ధోరణిలో అన్నట్లు అర్థమవుతున్నది. తమ దృక్కోణం నుంచి అది సరైన ధోరణే కావచ్చు. కాని యథాతథంగా చూసినపుడు, వారు అప్పుడప్పుడే బయటకు వస్తున్నారు. తక్షణం చేయదలచిందేమిటో నిర్ణయించుకుని ఉంటారు. భవిష్యత్ కార్యక్రమం అనేది సీరియస్‌గా జరగవలసిన చర్చ. అడవులలో ఎక్కడెక్కడనో ఉండినవారు ఒక చోటికి చేరి, ఈ ప్రశ్నపై రోజుల తరబడి చర్చించే అవకాశం వారికి ఉంటుందనుకోవటం అవాస్తవికం. ఇదే మాటను సూక్ష్మమైన రూపంలో ఆ నాయకులూ చెప్పారు. ఇప్పుడే గదా బయటకు వస్తున్నాము, ఏమి చేయాలో అందరం కలిసి మాట్లాడుకుంటాము అన్నారు వారు. ఏమి మాట్లాడి, ఏమి చేయవచ్చునన్నది మనం వేచి చూడవలసిన విషయం.ఇన్నిన్ని మాటలు చెప్పుకుని కూడా చివరకు, బయటకు వచ్చే వారి ప్రణాళిక ఏమిటని చర్చించటం ఆశ్చర్యంగా తోచవచ్చు. అవును, కొన్ని కారణాలవల్ల ఇది చర్చించదగినదే. ఇందులోని ఉద్దేశం మాత్రం పౌరహక్కుల బాధ్యుని వంటిది కాదు. కేవలం కొన్ని విషయాలను అర్థం చేసుకోవటమే. పైన అనుకున్నట్లు, గతంలో వలెగాక ఈసారి పెద్ద సంఖ్యలో బయటకు వస్తున్నారు. వారు చెప్తున్నది మౌలికంగా తమ సిద్ధాంతాన్ని మాత్రం మార్చుకోలేదని, ప్రజల కోసం వారి మధ్య ఉండి పని చేస్తూనే ఉంటామని. తమ పోరాట రూపం మాత్రమే మారుతున్నదని, ప్రభుత్వ బలగాలను ఎదుర్కొనగల శక్తి తమ పార్టీకి లోపించిన స్థితి వల్లనే ఉద్యమాన్ని విరమించాలా, ఆయుధాలు వదలాలా అనే చర్చకు కొంతకాలం క్రితమే ఆరంభం జరిగింది తప్ప, యథాతథంగా అంతకు ముందు అటువంటి చర్చ ఏమీ లేదని. ఇతరత్రా కూడా పార్టీలో, ఉద్యమంలో గతం నుంచి ఉండిన లోపాల కారణంగానే పరిస్థితి ఇంత వరకు పరిణమించిందని. మాటలు సరిగా ఇవే కాకపోవచ్చుగాని, భావం మాత్రం ఇదే.ఇటువంటి పరిస్థితుల మధ్య అంతిమంగా వీరు ఇక ముందు, తమ సిద్ధాంతాల ప్రకారం, మైదాన రాజకీయ, క్షేత్రంలో సామాజిక క్షేత్రంలో ఏమి చేయగలరనుకోవాలి? ఎందుకోసం, ఎటువంటి అవకాశాలు ఉండవచ్చు? అటువంటి ప్రశ్నలపై ఇది ఒక స్థూలమైన చర్చ మాత్రమే. బయటకు వచ్చిన విప్లవకారులు తమంతట తాము ఏదైనా చేయదలిస్తే ముందుగా తోచేది స్వయంగా ఒక పార్టీ ఏర్పాటు చేయటం. ప్రజాస్వామిక రాజ్యాంగ వ్యవస్థలోకి ప్రవేశించినందున, తమ సిద్ధాంతాలను మేళవిస్తూ అందుకు అనుగుణమైన పార్టీ మేనిఫెస్టో తయారీ. పార్టీ యంత్రాంగం. తెలంగాణ అంతటా సంస్థ విస్తరణ, ఎన్నికలలో పోటీలు. ఈ మొత్తం అన్నింటిలోనూ, తాము అంటున్న తమ సైద్ధాంతిక విశ్వాసాల ప్రతిఫలన. తమ మేనిఫెస్టో గాని, ఆచరణ గాని ఇపుడున్న అన్ని రకాల పార్టీలకు కొట్టవచ్చినంత భిన్నంగా ఉంటేనే ప్రజల దృష్టిని ఆకర్షించగలదు. సదరు ఆకర్షణ కొనసాగేది ఏ విధంగా అన్నది వేరే ప్రశ్న.పార్టీ పెట్టడమే నిర్ణయం అయిన పక్షంలో ఇంతకూ తమ పార్టీలో చేరగల వారెవరు? అడవిలోని దళ సభ్యులలో అధికులు అక్కడి ఆదివాసులే అయినందున తిరిగి తమ ప్రాంతాలకు వెళ్లి స్థిరపడే అవకాశమే ఎక్కువ. మైదాన ప్రాంతాలలోని పేదలు, దళితులు, గిరిజనులు, బిసిలు, మైనారిటీలు, యువకుల ఆలోచనలు, ఆకాంక్షలు ఒకప్పటివలె వామపక్ష భావజాలానికి సన్నిహితమైన రీతిలో లేవు. వారంతా వివిధ మధ్యేమార్గ పార్టీలు, అవి తమ అధికారం ద్వారా సమకూర్చగలవనుకునే అవకాశాలు, నిజమైన ఉద్యమాలంటూ అవసరం లేని పద్ధతులు, సంక్షేమ పథకాల సౌలభ్యాల మార్గంలోకి మళ్లిపోయారు. అటు నుంచి వెనుదిరగటం ఎంత మాత్రం తేలిక కాని దశ వచ్చి వేసింది. ఆ పరిస్థితుల మధ్య ఈ వర్గాల ప్రజలకు ఇపుడున్న సిపిఐ, సిపిఎం పట్లనే నమ్మకం పోయి వాటిలో చేరటం లేదు. ఇంకా చెప్పాలంటే విప్లవ పార్టీలలో చేరటమూ తగ్గిపోయింది. అటువంటి వాతావరణంలో కొత్తగా వచ్చే వామపక్ష పార్టీలోకి చేరికలు తేలిక కాదు. అంతేకాదు. పైన పేర్కొన్న సామాజిక వర్గాలకు చెందిన వారే నాయకులుగా ఎదిగి వస్తూ తమ సెక్షనల్ అజెండాలను ముందుకు తీసుకుపో జూస్తున్నారు. ఇవి ఏవీ కొత్త పార్టీకి అనుకూలించేవి కావు.పార్టీల నిర్వహణ విపరీతమైన ఖర్చుతో కూడుకున్నదిగా మారటం మరొక సమస్య. ఆ స్థాయిలో నిధులు సమకూరటం ఒక కొత్త వామపక్షానికి అసాధ్యం. నిధుల సమస్య గురించి ఇప్పటికే గల వామపక్షాలు కూడా మాట్లాడుతుంటాయి. డబ్బు కూడా ఒక ఆధారమనుకుంటే అవేమి వామపక్షాలనే ప్రశ్న రావచ్చు. వివిధ పరిస్థితుల వల్ల అదొక వాస్తవంగా మారిన సంగతి నిజం. దాని నుంచి ఎవరూ తప్పించుకోలేరు. తప్పించుకోగలమనటం శుష్క ఆదర్శవాదమవుతుంది. మన రాజకీయాలు, ప్రజా స్వామ్యం కూడా పేట్రనైజేషన్ (పోషకులు పోషితులు) స్థితిలోకి మారిపోయాయి. ఉన్న కమ్యూనిస్టులే పెద్ద పార్టీల ఎదుట పోషితులుగా నిలుస్తున్నారు. ఇక ప్రజల మాట చెప్పనక్కర లేదు. చివరగా చెప్పాలంటే, సమాజంలో ఆదర్శవాదం గణనీయంగా తగ్గిపోయి వస్తువాదం, వినిమయవాదం, వ్యక్తివాదం పెరుగుతున్నాయి. వీటి ప్రభావాలు కుటుంబ సంబంధాలపైన సైతం పడుతున్నాయి. ఈ విధమైన పరిణామాలు అన్నీ కూడా వామపక్ష రాజకీయాలకు అనుకూలమైనవి కావు.మరొక పద్ధతి ఒక పార్టీ అంటూ ప్రారంభించి, ఇతర వామపక్ష పార్టీలతో కలిసి ఆ విధంగా ఉమ్మడి శక్తితో సమాజంలో ఒక వాతావణాన్ని సృష్టించేందుకు ప్రయత్నించటం. ఇతర వామపక్షాలలో కొందరికి ఇటువంటి ఆలోచనలు ఉన్నట్లున్నాయి. సూత్ర రీత్యా ఇది మంచి ఆలోచనే కావచ్చు. కాని అందులోనూ సమస్యలుంటాయి. ఆ రెండు పార్టీలకు తమలోతమకే కుదరటం లేదు. కారణాలు అనేకం. ఆ రెండింటి మధ్య మూడవ పార్టీకి చోటు అనుమానమే. ఈ మూడవది తమకు పోటీదారు అనుకునే అవకాశమే ఎక్కువ. ఎందుకంటే వారికి అసలు వామపక్ష స్పృహ, లక్షాలు నిలిచిలేనపుడు, ఇతరులను కలుపుకొని కమ్యూనిస్టు అజెండాను ముందుకు తీసుకుపోయే ఉద్దేశం ఎట్లా కలుగుతుంది? ఈ పరిస్థితులను బట్టి మిగిలేది ఎవరితో వీలైతే వారితో పొత్తు కుదురుకోవటం, ఇక కాదంటే, లోగడ కొందరు మాజీ విప్లవ కారులు చేసినట్లు ఎవరికి తోచిన పార్టీలో వారు చేరటం. అంతటితో సమాధానపడటం. బయటకు వస్తున్న వారు అందుకు చెప్తున్న కారణాలలో ఒకటి ఆరోగ్య సమస్యలు. పెద్ద నాయకులంతా వయసు మీరిన వారే. ఈ రెండు అంశాలు ఉన్నపుడు వారు కొత్త పార్టీ స్థాపన, అందుకోసం పని చేయటమనే నిరంతర శారీరక, మేధోశ్రమను తీసుకోగలరా? బయటకు వచ్చినా పోలీసుల నిఘా వెన్నాడుతూనే ఉంటుంది గనుక ఆ చికాకులను తట్టుకోగలరా? వారికి ఇప్పటికీ తమ సిద్ధాంతంపట్ల అదే కట్టుబాటు నిలిచి ఉన్నా తేలిక కాదు. ఈ చర్చ అంతటి ఉద్దేశం ఒక తఫాను అనంతర పరిస్థితిలోని ఒక కోణాన్ని మాత్రం అర్థం చేసుకునే ప్రయత్నమే.

# భారత్ పై అదే ద్వేషం.. వసలదారులపై అమెరియా యాడ్ దుమారం



న్యూఢిల్లీ,అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చాక వలస విధానాలు మరింత కఠినమయ్యాయి. ‘అమెరికా ఫస్ట్’ అనే నినాదంతో, ప్రభుత్వం మాస్ డిపోర్టేషన్లు, అరెస్టులు, చట్టపరమైన ప్రవేశాలపై ఆంక్షలను కొత్త నిబంధనగా మార్చింది. ముఖ్యంగా వృత్తి నిపుణులకు ఇచ్చే హెచ్-1బీ వీసా దారులపై, వారిలో అధికంగా ఉన్న భారతీయులపై, వైట్ హౌస్ యంత్రాంగం బహిరంగంగానే వ్యతిరేకత వ్యక్తం చేస్తోంది.

లేబర్ డిపార్ట్‌మెంట్ ప్రకటనలో భారత్‌పై అక్కసు

ఇటీవల, అమెరికా లేబర్ డిపార్ట్‌మెంట్ ఒక అధికారిక ప్రకటనను విడుదల చేసింది. ఈ యాడ్‌లో కంపెనీలు హెచ్-1బీ వీసాలను దుర్వినియోగం చేస్తున్నాయని, దీనివల్ల అమెరికన్ యువతకు ఉద్యోగ అవకాశాలు తగ్గిపోతున్నాయని ఆరోపించింది. “హెచ్-1బీ వీసా దుర్వినియోగం కారణంగా అమెరికన్ యువత తమ అమెరికన్ డ్రీమ్‌ను కోల్పోతున్నారు. విదేశీ కార్మికులు తక్కువ వేతనాలకు పనిచేస్తూ స్థానికుల అవకాశాలను దొంగిలిస్తున్నారు. కానీ ట్రంప్ ప్రభుత్వం ఈ అన్యాయాన్ని అరికట్టేందుకు చర్యలు తీసుకుంటోంది” అని ఆ వీడియోలో స్పష్టంగా పేర్కొంది.ఇందులో మరింత వివాదాస్పదమైన విషయం ఏమిటంటే.. కేటాయించిన హెచ్-1బీ వీసాలలో 72 శాతం భారతీయులకే వెళ్తున్నాయని గ్రాఫ్ రూపంలో చూపడం ద్వారా, భారత్‌ను పరోక్షంగా ఈ ‘దుర్వినియోగానికి’ ప్రధాన కారణంగా చూపింది.

ప్రాజెక్ట్ ఫైర్‌వాల్, పెరిగిన ఫీజుల భారం

ఈ ఆరోపణల నేపథ్యంలో, లేబర్ డిపార్ట్‌మెంట్ “ప్రాజెక్ట్ ఫైర్‌వాల్” పేరిట హెచ్-1బీ వీసా వ్యవస్థలో అవకతవకలు ఉన్నాయా అనే దానిపై విస్తృత ఆడిట్ ప్రారంభించింది. అంతేకాకుండా ట్రంప్ ప్రభుత్వం హెచ్-1బీ వీసా ఫీజులను భారీగా పెంచింది. ఈ ఫీజును ఏకంగా లక్ష డాలర్లకు పెంచాలని భావించడం దేశవ్యాప్తంగా పెద్ద చర్చనీయాంశమైంది. “ఈ వీసా వ్యవస్థలో మోసాలు ఎక్కువ. అమెరికన్ల వేతనాలను తగ్గిస్తోంది. కాబట్టి దానిని సరిదిద్దుతాం” అని వైట్ హౌస్ ఈ చర్యను సమర్థించుకుంది.

న్యాయస్థానాల మెట్లు ఎక్కిన అభ్యంతరాలు

ట్రంప్ ప్రభుత్వ ఈ కఠిన నిర్ణయాలపై అమెరికాలో పెద్ద ఎత్తున వ్యతిరేకత వ్యక్తమైంది. అమెరికా ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఈ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకించింది. వీసా వ్యవస్థ కాంగ్రెస్ ఆమోదించిన విధానమని, ట్రంప్ జోక్యంతో అది దెబ్బతింటోందని ఆరోపిస్తూ కోర్టును ఆశ్రయించింది. అనేక ఉద్యోగ సంఘాలు ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశాయి. కాంగ్రెస్ సభ్యులు అధ్యక్షుడికి లేఖ రాసి, నైపుణ్యవంతులైన వలసదారులు అమెరికా ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అని, వారిపై ఆంక్షలు సరికాదని గుర్తుచేశారు.

అమెరికన్ కంపెనీలకు సవాలు

హెచ్-1బీ వీసా దారులపై తీసుకుంటున్న ఈ నిర్ణయాలు అమెరికా కంపెనీలకు.. ముఖ్యంగా టెక్, ఆరోగ్య రంగాలకు పెద్ద సవాలుగా మారాయి. నైపుణ్య కార్మికుల కొరత పెరిగే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. భారతీయ ఐటీ కంపెనీలు, ఇక్కడ పనిచేస్తున్న ప్రొఫెషనల్స్ ఈ పరిణామాల వల్ల తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.మొత్తంగా ట్రంప్ ప్రభుత్వం “అమెరికా ఫస్ట్” అనే నినాదం కింద వలస విధానాలను కఠినతరం చేస్తూ, విదేశీ ప్రతిభపై ఆధారపడిన అమెరికా ఆర్థిక వ్యవస్థను ఒక కొత్త పరీక్షకు గురి చేస్తోంది.

### టీజీ సెట్ – 2025 దరఖాస్తు గడువును పొడగింపు

హైదరాబాద్,తెలంగాణ రాష్ట్రంలో అసిస్టెంట్ ప్రొఫెసర్, డిగ్రీ లెక్చరర్‌షిప్‌కు అర్హత సాధించేందుకు నిర్వహించే టీజీ సెట్ - 2025 దరఖాస్తు స్వీకరణ గడువును పొడగించినట్లు సెట్ మెంబర్ సెక్రెటరీ ప్రొఫెసర్ బి. శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎలాంటి అపరాధ రుసుము లేకుండా వచ్చే నెల 6వ తేదీలోగా ఫీజు చెల్లించి, దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు.

## వర్షాలతో అంటువ్యాధులు రాకుండా చర్యలు

నల్గొండ, ఇటీవలి వర్షాల వల్ల అంటు వ్యాధులు ప్రబలకుండా జిల్లా వ్యాప్తంగా ఎపిడమిక్ సెల్, రెస్క్యూ టీంలను ఏర్పాటు చేశామని నల్గొండ జిల్లావైద్యాధికారి పుట్ల శ్రీనివాస్ వెల్లడించారు. డివిజన్ల వారీగా జిల్లా కార్యాలయంలో టోల్‌ఫ్రీ నంబర్లు ఏర్పాటు చేశారు. పీహెచ్‌సీల్లో వైద్యులకు సెలవులు రద్దు చేశామని, అత్యవసర సేవలు అందించేందుకు పాము, తేలుకాటుకు సంబంధించిన ఔషధాలు సిద్ధంగా ఉంచామన్నారు. డెంగీ, జ్వరాలు రాకుండా కాచిచల్లార్చిన నీటిని తాగాలి. వృద్ధులు, గర్భిణులు జాగ్రత్తలు పాటించాలన్నారు. మూడు జిల్లాసుపత్రుల్లో రోగులు చికిత్స కోసం వచ్చినా తగిన ఏర్పాట్లు చేసినట్లు వైద్యులు తెలిపారు. ఎక్కువగా జ్వరాలు, దగ్గు, జలుబు వంటి అంటువ్యాధులతో పాటు పదుల సంఖ్యలో రైతులు పాము, తేలుకాటుకు గురైనవారు ఉన్నట్లు పేర్కొన్నారు. అన్ని పీహెచ్‌సీల్లో సరిపడా అత్యవసర మందులు అందుబాటులో ఉంచారు. పల్లె, బస్తీ దవాఖానాల్లోని వైద్యులకు నవంబరు 3 వరకు అత్యవసర పరిస్థితుల్లో తప్ప సెలవులు రద్దు చేశారు. ఇకపోతే మొంథా తుపాను ప్రభావంతో ఉమ్మడి జిల్లాలో కొన్ని రహదారులు ఛిద్రమయ్యాయి. లోతట్టు ప్రాంతాలు జలమయం కాగా .. శిథిలమైన పాత భవనాలు, ఇళ్లు నేలమట్టమయ్యాయి. ప్రధానంగా సూర్యాపేట- వరంగల్ ప్రధాన రహదారిపై నెమ్మికల్ వద్ద రహదారి కోతకు గురికావడంతో రాకపోకలు నిలిచాయి. దీంతో అధికారులు చివ్వెంల-ఏపూరు మీదుగా ఖమ్మం రోడ్- వరంగల్‌కు భారీ, చిన్నతరహా వాహనాలను మళ్లించారు. చింతలపాలెం-దొండపాడు వద్ద 100 మీటర్ల వరకు రహదారిపై కోత పడటంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. యాదాద్రి జిల్లాలోని రుద్రవెల్లి-జూలూరు, బొల్లేపల్లి-సంగెం గ్రామాల మధ్య వరద ఉధృతి తగ్గే వరకు రాకపోకలు నిలిపివేశారు. నల్గొండ జిల్లా దేవరకొండ నియోజకవర్గం చందంపేట మండలంలోని 12 గ్రామాల్లో రాకపోకలు నిలిచిపోయాయి. మూడు జిల్లాల్లో 30 ఇళ్లు పూర్తిగా, 53 ఇళ్లు పాక్షికంగా నేలకూలాయని కలెక్టరేట్‌లోని విపత్తు, స్పందనల శాఖలోని కంట్రోల్ రూమ్ పర్యవేక్షణ అధికారులు వెల్లడించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 39 ప్రాంతాల్లో 13.46 కి.మీ మేర రహదారులు దెబ్బతిన్నాయి. 25 చోట్ల రహదారులపై అంతరాయం ఏర్పడింది. మొత్తం రూ.70.46 లక్షల నిధులతో మరమ్మతులు చేసేందుకు రహదారులు, భవనాల శాఖ అధికారులు తాత్కాలిక అంచనాలు ప్రతిపాదించి.. శాశ్వత మరమ్మతులకు సుమారు రూ.20.8 కోట్లు అవసరమవుతాయని ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి నివేదించారు.

## తిరుమల కల్తీ నెయ్యి కేసు

తిరుమల, తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి కేసు కీలక మలుపు తిరిగింది. కల్తీ నెయ్యి సరఫరా వెనుక భారీ కుట్ర ఉన్నట్లు సిట్ అధికారులు గుర్తించారు. నాటి ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి సన్నిహితుడు చిన్నఅప్పన్న అరెస్టుతో కీలక అంశాలు వెలుగులోకి వచ్చాయి. ఈ మేరకు అప్పన్న రిమాండ్ రిపోర్టులో కుట్ర కోణాలను సిట్ ప్రస్తావించింది. 2022 తితిదే కొనుగోళ్ల విభాగం జీఎంను అప్పన్న సంప్రదించారు. నెయ్యి సరఫరా చేసే భోలేబాబా డెయిరీ యాజమాన్యానికి ఫోన్ చేశారు. ప్రతి కిలో నెయ్యిపై రూ.25 కమిషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అందుకు భోలేబాబా డెయిరీ యాజమాన్యం నిరాకరించింది. దీంతో ఆ డెయిరీపై అనర్హత వేటు వేసేలా చిన్నఅప్పన్న కుట్రకు తెరలేపారు. డెయిరీని తనిఖీ చేయాలంటూ తితిదే అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చారు. డెయిరీపై అనర్హతవేటు వేసేలా అజ్ఞాతవ్యక్తులతో పిటిషన్లు వేయించారు. చిన్నఅప్పన్న కుట్రతో బోలేబాబా డెయిరీ నుంచి నెయ్యి సేకరణను తితిదే నిలిపివేసింది. ఆ స్థానంలో ప్రీమియర్ అగ్రిఫుడ్స్ సంస్థ ప్రవేశించి.. రూ.138 ఎక్కువ కోట్ చేసింది. పోటీ లేకపోవడంతో కాంట్రాక్టు దక్కించుకుంది. కల్తీ నెయ్యి కేసులో అప్పన్నను 24వ నిందితుడిగా చేర్చింది.

## నష్టం ఏ స్థాయిలో అంటే..!

అమరావతి,‘మొంథా’ తుపాను మచిలీపట్నం, కళింగపట్నం మధ్యలో పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం సమీపంలో తీరం దాటినట్లు భారత వాతావరణ విభాగం ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో రెండు తెలుగు రాష్ట్రాలు కాస్త ఊపిరి పీల్చుకున్నాయి. ఈ సమయంలో మొంథా రాష్ట్రాన్ని ఏస్థాయిలో ముంచిందో వివరిస్తూ ఏపీ సీఎం చంద్రబాబు మీడియా ముందుకు వచ్చారు!అవును... మొంథా తుపాను ఏపీలో దాదాపు అన్ని జిల్లాల్లోనూ పంటలకు, రహదారులకు నష్టం కలిగించిందని చెబుతున్నారు. ప్రధానంగా ఉమ్మడి గోదావరి జిల్లాల్లో దీని ప్రభావం ఎక్కువగా ఉందని అంటున్నారు. ప్రధానంగా వరి రైతులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారని.. వీరితో పాటు పత్తి, వేరుశనగ, మొక్కజొన్న రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలుస్తోంది. ఈ సమయంలో సీఎం స్పందించారు.

రాష్ట్రానికి రూ.5,265 కోట్ల మేర నష్టం!:

ఏపీలో మొంథా కలిగించిన నష్టాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు మీడియాకు వివరించారు! ఈ సందర్భంగా... మొంథా తుపాను వల్ల రాష్ట్రానికి రూ.5,265 కోట్ల మేర నష్టం వాటిల్లిందని ప్రాథమికంగా అంచనా వేసినట్లు తెలిపారు. ఇందులో.. వ్యవసాయ రంగానికి రూ.829 కోట్లు, ఆక్వా రంగానికి రూ.1,270 కోట్లు, ఆర్ అండ్ బీకి రూ.2,079 కోట్ల మేర నష్టం వాటిల్లిందని చెప్పారు. అయితే... తుపాను వల్ల ఎవరూ ప్రాణాలు కోల్పోలేదని వెల్లడించారు.ఈ సందర్భంగా.. ప్రతి కుటుంబాన్ని, ప్రతీ ఇంటినీ జియోట్యాగింగ్ చేయగలిగామని.. తుపాను వల్ల మారుతున్న పరిణామాలకు తగ్గట్లుగా నిర్ణయాలు తీసుకున్నామని చంద్రబాబు తెలిపారు. గతంలో విద్యుత్ సరఫరా ఆగితే 10 గంటల వరకు వచ్చేది కాదని.. అయితే, ప్రస్తుతం విద్యుత్ సరఫరా ఆగినా 3 గంటల్లోనే పునరుద్ధరణ జరిగిందని.. దానికి కారణం అంతా నిబద్ధతతో పని చేయడమేనని తెలిపారు.ఇక గ్రామ, వార్డు సచివాలయాలను యాక్టివ్ చేశామని చెప్పిన చంద్రబాబు.. నెల్లూరు, ప్రకాశం జిల్లాలో అధికంగా వర్షాలు పడ్డాయని తెలిపారు. వర్షాల వల్ల వరదలు వచ్చాయని.. పులిచింతల వద్ద భారీగా వరద నీరు వచ్చి చేరిందని వివరించారు. ఈ నేపథ్యంలో.. పంట నష్టంపై ఐదు రోజుల్లో నివేదిక అందజేయాలని అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు.

ముందస్తు చర్యలతో తగ్గిన నష్టం!:

మరోవైపు, కృష్ణా జిల్లా అవనిగడ్డ నియోజకవర్గంలోని కోడూరు మండలం కృష్ణాపురం గ్రామంలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పర్యటించారు. ఈ సందర్భంగా... ‘మొంథా’ తుపాను ప్రభావంతో దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.ఇదే సమయంలో... తుపాను ప్రభావిత ప్రాంతాల ప్రజలకు ఉచితం బియ్యం అందిస్తున్నామని.. పునరావాస కేంద్రాల్లో అన్ని సదుపాయాలు కల్పించామని.. ఇళ్లకు వెళ్లే సమయంలో ఒక్కో కుటుంబానికి రూ.3వేలు ఇస్తున్నామని చెప్పిన పవన్ కల్యాణ్... గ్రామాల్లో పాడైన రోడ్లకు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతు చేస్తామని తెలిపారు.ఇదే క్రమంలో... మొంథా తుపానుతో కలిగే నష్టాన్ని ప్రధానంగా ముందస్తు చర్యలతో చాలా వరకు తగ్గించామని పవన్ కల్యాణ్ అన్నారు.

# రేవంత్ ప్రభుత్వంలో కాంగ్రెస్ సీనియర్లకు పెద్ద పీట..



హైదరాబాద్, తెలంగాణలో జాగ్రత్తగా అడుగులు వేస్తోంది అధికార కాంగ్రెస్ పార్టీ. రేవంత్ మంత్రివర్గంలో తమకు ఛాన్స్ వస్తుందని చాలామంది సీనియర్లు ఆశలు పెట్టుకున్నారు. ఆలస్యం కావడంతో కీలక నిర్ణయం తీసుకుంది. శుక్రవారం మధ్యాహ్నం ఓ వైపు మంత్రిగా అజారుద్దీన్ ప్రమాణ స్వీకారం చేశారు. ఆ తర్వాత మరో ఇద్దరు నేతలకు కీలక పదవులను అప్పగించింది.

సీనియర్లకు రేవంత్ సర్కార్ పెద్ద పీట


మంచిర్యాల కాంగ్రెస్ ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్‌రావు, మరొకరు బోధన్ ఎమ్మెల్యే సుధర్షన్ రెడ్డి. వీరిద్దరి కీలక బాధ్యతలను అప్పగించి రేవంత్ ప్రభుత్వం. తెలంగాణ రాష్ట్ర సివిల్ సప్లైస్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్‌రావుని నియమించింది. తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో కీలక నేతల్లో ఆయన కూడా ఒకరు. ఉమ్మడి ఏపీలో ఆయన ఎమ్మెల్సీగా పని చేశారు. ఒకసారి పీసీసీ సభ్యుడిగా, మరోసారి పీసీసీ కార్యదర్శిగా పని చేశారు. అంతేకాదు వైఎస్ఆర్ హయాంలో టీటీడీ బోర్డు సభ్యుడిగా ఉన్నారు. అలాగే ఆదిలాబాద్ డీసీసీబీ ఛైర్మన్ బాధ్యతలు నిర్వహించారు. ఆ తర్వాత స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా గెలుపొందారు. 2018 నుంచి ప్రేమసాగర్ రావు ఏఐసీసీ సభ్యుడిగా ఉన్నారు. 2023 ఎన్నికల్లో మంచిర్యాల నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు.

ప్రేమసాగర్ రావు, సుదర్శన్‌రెడ్డిలకు కీలక పదవులు

ఫ్లాగ్ షిప్ సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలకు ప్రభుత్వ సలహాదారుగా ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిని నియమించింది. ఇద్దరు నేతలకు కేబినెట్ హోదా లభించనుంది. కాంగ్రెస్ పార్టీకి కీలకమైన వ్యక్తుల్లో ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి మరొకరు. 1989లో రాజకీయాల్లోకి వచ్చారు. 1999, 2004, 2009 ఎన్నికల్లో వరుసగా మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. వైఎస్ఆర్ మంత్రి వర్గంలో నీటిపారుదల శాఖ మంత్రిగా పని చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2014, 19 ఎన్నికల్లో ఆయన ఓటమి పాలయయారు. ఆ తర్వాత నియోజకవర్గంపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టారు. 2023 ఎన్నికల్లో ఆయన విజయఢంకా మోగించారు. రేవంత్ కేబినెట్‌లో ఆయనకు చోటు దక్కుతుందని భావించారు. కాకపోతే రాజకీయ సమీకరణాల నేపథ్యంలో డిలే అవుతూ వస్తోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఆయనకు కీలక బాధ్యతలు అప్పగించింది.

# నిషేధిత భూములపై తర్జన భర్జన.. సీసీఎల్ఏకు చేరుకున్న జాబితా!

హైదరాబాద్, రాష్ట్రవ్యాప్తంగా నిషేధిత భూముల జాబితా ఒక కొలిక్కి వచ్చింది. అయితే రంగారెడ్డి జిల్లాలో భూములపై రెవెన్యూ శాఖ తర్జన భర్జన పడుతోందని సమాచారం. గతంలో మాదిరి కాకుండా నిషేధిత జాబితాలో భూములను చేరిస్తే సహేతుక కారణాలు స్పష్టంగా వెల్లడించాలని, ఆ వివరాలు భూ భారతి, సబ్ రిజిస్ట్రార్ వెబ్ పోర్టల్‌లో కన్పించాలని హైకోర్టు ఆదేశించింది. దీంతో చీఫ్ కమిషనర్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ (సీసీఎల్ఏ) ఆధ్వర్యంలోని కమిటీ అన్ని రికార్డులనూ పరిశీలిస్తున్నది. ఇదిలా ఉంటే నిషేధిత జాబితా నుంచి భూములు తొలగించాలని కోర్టులు ఆదేశాలు ఇస్తున్నా రంగారెడ్డి జిల్లాలో అమలు చేయడం లేదనే ఆరోపణలు కూడా ఉన్నాయి. తమకు అనుకూలంగా ఉంటే ఒక రకంగా.. లేనట్లయితే మరో రకంగా జిల్లా అధికారులు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. పైవాళ్లు చెబితేనే పని అవుతుందని చెప్పి తప్పించుకుంటున్నారని అంటున్నారు. ఇలాంటి సమస్యలు పరిష్కరించేందుకు 30 శాతం వాటాలు అడుగుతున్నారనే విమర్శలున్నాయి. నిషేధిత భూముల జాబితా (22-ఏ)ను పక్కాగా రూపొందించాలని తెలంగాణ హైకోర్టు రెవెన్యూ శాఖను ఆదేశించింది. గడువు విధించడంతో రెవెన్యూ శాఖ జాబితా రూపకల్పనలో నిమగ్నమై ఉంది. నవంబర్ మొదటి లేదా రెండో వారంలో సవివరంగా నిషేధిత భూముల వివరాలను భూ భారతి, సబ్ రిజిస్ట్రార్ పోర్టల్‌లో పొందుపర్చనున్నారని తెలుస్తున్నది. ఈ మేరకు జిల్లాల నుంచి జాబితాను తెప్పించుకుని సిద్ధం చేస్తున్నారని సమాచారం. ఈ జాబితా తయారీ కోసం సీసీఎల్ఏ ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు అయ్యింది. ఈ కమిటీలో రిటైర్డ్ డిస్ట్రిక్ట్ జడ్జ్, సర్వే అండ్ సెటిల్‌మెంట్ డైరెక్టర్ ఉన్నారు. త్రిసభ్య కమిటీ జిల్లాల నుంచి వచ్చిన భూముల వివరాలను వడపోస్తున్నది. ఒక్క రంగారెడ్డి జిల్లా విషయంలోనే ఆచితూచి వ్యవహరిస్తున్నారు. పదిహేను వేల ఎకరాల వరకు అదనంగా చేర్చుతుండటంతో మొత్తం రెవెన్యూ, సర్వే రికార్డులను జల్లెడపడుతున్నారని సమాచారం. రికార్డ్ ఆఫ్ రైట్స్ (ఆర్ఓఆర్)తో పాటు సేత్వార్‌లో ఆ వివరాలను పరిశీలిస్తున్నారు. ఈ రెండింట్లో తేడా ఉన్నట్లయితే 1954 రికార్డును ప్రామాణికంగా తీసుకుంటున్నారు. నిజాం నవాబు నుంచి తెలంగాణ ప్రాంతం విముక్తి అయిన తరువాత 1954 లో భూముల రికార్డులను రూపొందించిన విషయం తెలిసిందే.



కోర్టులు కూడా ప్రత్యేక సందర్భాలలో 1954 నాటి రికార్డును పరిగణలోకి తీసుకుని తీర్పులు ఇస్తున్నాయి. ఇప్పటి వరకు నిషేధిత భూముల జాబితా విషయంలో స్పష్టత లేదు. రిజిస్ట్రేషన్ కోసం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వెళ్లిన సందర్భంలో పలువురికి ఈ సమస్యలు ఎదురవుతున్నాయి. అయితే అందులో సహేతుకమైన కారణాలు మాత్రం వెల్లడించడం లేదు. ఏ కారణాలతో నిలిపివేశారనేది తెలియకపోవడం మూలంగా విక్రయదారులు, కొనుగోలుదారులు అష్టకష్టాలు పడుతున్నారు. ఆర్థికంగా నష్టపోతున్నారు, లావాదేవీలు నిలిచిపోతున్నాయి. దీనికి తెర దించేందుకు సహేతుక కారణాలను భూ భారతి, సబ్ రిజిస్ట్రార్ పోర్టల్‌లో స్పష్టం చేయాలని హైకోర్టు ఆదేశించింది. నిషేధిత జాబితాలో ఉంటే ఫలానా కారణాలతో రిజిస్ట్రేషన్ కు అనుమతించడం లేదని సబ్ రిజిస్ట్రార్లు లేదా తహశీల్దార్లు వెల్లడిస్తారు.

హైకోర్టు ఆదేశాలు బేఖాతర్!

నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించాలని హైకోర్టు ఆదేశాలు ఉన్నా రంగారెడ్డి జిల్లాలో అమలు కావడం లేదు. ఎందుకు తొలగించడం లేదని జిల్లా అధికారులను ప్రశ్నిస్తే పొంతన లేకుండా సమాధానాలు చెబుతున్నారని భూ యజమానులు వాపోతున్నారు. పై వాళ్లు చెబితే పని అవుతుందని చెబుతున్నారంటున్నారు. హైకోర్టు ఆదేశాలు ఇచ్చిన తరువాత కూడా పై వాళ్ల పేర్లు ఎందుకు చెబుతున్నారని ప్రశ్నిస్తే సమాధానం లేదని బాధితులు అంటున్నారు.

# ఉమ్మడి నిజామాబాద్ రైతులపై దెబ్బ

నిజామాబాద్,ఉమ్మడి నిజామాబాద్ ప్రజలు, రైతులు మొంథా తుపాను ప్రభావంతో తీవ్రంగా నష్టపోయారు. వరుసగా ఇది రెండోసారి భారీ వర్షాలు కురవడంతో అన్నదాతలు కుదేలయ్యారు. ఉమ్మడి జిల్లాలో కురిసిన భారీ వర్షాలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట తడిసి పోవడం ఒక ఎత్తయితే, కోయకుండా పొలాల్లో ఉన్న వరి, పత్తి, మొక్కజొన్న మొత్తం నీటిపాల య్యింది. దీంతో వీరు ఆందోళన చెందుతున్నారు. కొనుగోలు కేంద్రాలు, కల్లాలు, రోడ్లపై ఆరబెట్టిన ధాన్యం కొట్టుకుపోగా పలుచోట్ల తడిసి ముద్దయ్యింది. కొన్నిచోట్ల ఆరబెట్టి కొనుగోలుకు సిద్ధం చేసిన ధాన్యం భారీ వర్షాలకు పూర్తిగా తడిసి మొలకలు వస్తున్నాయి. వరదలో వడ్లు కొట్టుకుపోయాయి. కొందరు రైతులు చేసేదేమీలేక ఆరబెట్టిన ధాన్యాన్ని ప్రభుత్వం కొంటుందేమో అన్న ఆరాటంతో కంట తడిపెడుతున్నారు. డిచ్‌పల్లి, బోధన్, ధర్పల్లి, లింగంపేట, నాగిరెడ్డిపేట తదితర మండలాల్లో కురిసిన వర్షానికి రోడ్లపై ఆరబెట్టిన ధాన్యం తడిసి ముద్దయ్యింది. వడ్ల కుప్పల్లోకి వర్షపు నీరు వచ్చి చేరింది. ఆరుగాలం శ్రమించి పండించిన పంట విక్రయించడానికి కేంద్రానికి తీసుకువచ్చి ఆరబెడితే వర్షం కారణంగా పూర్తిగా తడిసిపోయిందని రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. కోతకు వచ్చిన ధాన్యం రాలిపోతున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షంలో తడవకుండా ఉండడానికి నానా తంటాలు పడ్డారు. తడిసిన ధాన్యానికి రూ.500 బోనస్ ఇచ్చి కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాల్లో సరైన సదుపాయాలు లేక పోవడంతోనే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు రైతులు తెలిపారు. ధాన్యం తడవకుండా అధికారులు వెంటనే టార్పాలిన్లు అందించివుంటే నష్టం ఇంతగా ఉండేది కాదన్నారు. ధాన్యం రంగు మారడంతో పాటు మొలకలు వచ్చే అవకాశం ఉన్నదని, అధికారులు స్పందించి గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో తూకం ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్లపై ఆరబెట్టుకున్న ధాన్యం తడిసిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తడిసిన ధాన్యాన్ని మళ్లీ ఆరబెట్టుకుందామంటే మళ్లీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని వాతావరణ శాఖ ప్రకటించింది. చేతికి వచ్చిన పంట వర్షార్పణం కావడంతో తమను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. అకాల వర్షాలకు ధాన్యం తడుస్తున్నా సొసైటీ సిబ్బంది టార్పాలిన్లు ఇవ్వడంలేదని ఆగ్రహించిన అన్నదాతలు ఆందోళన చేపట్టారు. కోటగిరి మండల కేంద్రంలో సహకార సంఘం గోదాం వద్ద ధర్నా చేపట్టారు. అనంతరం కోటగిరి-పొతంగల్ ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. సొసైటీ సిబ్బంది తీరుపై నిరసన వ్యక్తంచేశారు. సహకార సంఘం సిబ్బంది చిన్న రైతులను పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. ఇప్పటికే ధాన్యం విక్రయించుకున్న పెద్ద రైతులకు అవసరం లేకున్నా టార్పాలిన్లు ఇచ్చారని ఆగ్రహం వ్యక్తంచేశారు. చిన్న రైతులకు చెందిన ధాన్యం వర్షాలకు తడిసి, మొలకలు వస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారని వాపోయారు. మొత్తంగా ఉమ్మడి జిల్లాలో ఎడాపెడా కురుస్తోన్న వానలతో రైతు పరిస్థితి ఆందోళనకరంగా మారింది. వానాకాలం సీజన్ ముగిసినప్పటికీ వానలు వీడక పోవడంతో రైతులు తలలు పట్టుకుంటున్నారు. చేతికి వచ్చిన పంటను కోయలేక



అనుకూల వాతావరణం కోసం ఎదురు చూస్తున్నారు. వరి కోసిన రైతులంతా తేమ శాతం తగ్గించుకునేందుకు రోడ్లపై పాట్లు పడుతున్నారు. పీఏసీఎస్, ఐకేపీ కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్తే సిబ్బంది నిర్వాకంతో ధాన్యం వర్షానికి తడిసి పోతోంది. టార్ఫలిన్ కవర్లు సరిపడా అందుబాటులో పెట్టకపోవడంతో సమస్య ఎదురవుతోందని వాపోతున్నారు. గ్రామ స్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలంటూ కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. కోసిన ధాన్యాన్ని ఆరబెట్టుకునేందుకు కల్లాలు లేకపోవడంతో చాలా మంది రోడ్లపై కుప్పలు పోస్తున్నారు. ఆకస్మికంగా కురిసే వానలతో ధాన్యం తడిసి పనికి రాకుండా పోతోంది. తేమ శాతం పేరుతో కేంద్రాల్లో కొనుగోళ్లకు ససేమిరా అంటుండడంతో దిక్కుతోచని స్థితిలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. కొనుగోళ్లు జరిగినప్పటికీ ట్యాబ్ ఎంట్రీ సరిగా లేకపోవడంతో నిజామాబాద్ జిల్లాలో రూ.170కోట్లు చెల్లింపులు జరగాల్సి ఉన్నది. కామారెడ్డి జిల్లాలో రూ.30కోట్లు మేర పెండింగ్ ఉన్నాయి. నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు రూ.275కోటు విలువ చేసే 1.15లక్షల మెట్రిక్ టన్నులు మేర ధాన్యాన్ని సేకరించారు. ఇందులో 6552 మెట్రిక్ టన్నులు దొడ్డు రకం, 1.08లక్షలు సన్న రకం ధాన్యం ఉంది. 704 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు సిద్ధం చేయగా ఇప్పటి వరకు 657 కేంద్రాలు ప్రారంభమయ్యాయి. 354 సెంటర్లకు ధాన్యం రాక మొదలవ్వగా కొనుగోలు షురూ అయ్యా యి. 3218 మంది రైతులకు రూ.100కోట్లు చెల్లింపులు పూర్తయ్యాయి. మిగిలిన ధాన్యానికి చెల్లింపులు జరగాలంటే ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేయాలి. పీఏసీఎస్, ఐకేపీ సెంటర్లలో సిబ్బంది నిర్లక్ష్యం మూలంగా నమోదు పక్రియ సత్వరం జరగడం లేదు. ఫలితంగా రైతుకు కనీస మద్ధతు ధర జమ కావడానికి జాప్యం జరుగుతోంది. కామారెడ్డి జిల్లాలో ఇప్పటి వరకు 2,500 మంది రైతుల నుంచి 20వేల మెట్రిక్ టన్నులు వరకు ధాన్యాన్ని సేకరించారు. ఇందులో 6వేల మెట్రిక్ టన్నులు దొడ్డు రకం, మిగిలినది సన్న రకం ధాన్యం ఉంది. 190 ఐకేపీ, 233 పీఏసీఎస్ కేంద్రాలను ప్రారంభించారు. ప్రస్తుతం 124 చోట్ల కొనుగోళ్ల సందడి నెలకొన్నట్లుగా అధికారులు చెబుతున్నారు. కామారెడ్డిలో రూ.40కోట్లు విలువ చేసే ధాన్యాన్ని కొనుగోలు చేయగా రూ.12కోట్లు మేర కనీస మద్ధతు ధరకు చెల్లింపులు పూర్తి చేశారు.

# చంద్రబాబు,పవన్,లోకేశ్ వ్యవహారంపై హాట్ టాపిక్



అమరావతి,ఏపీలో కూటమి ప్రభుత్వం మంచి సమన్వయంతో పనిచేస్తోంది. కూటమిలో గిల్లికజ్జాలు తేవడానికి ప్రత్యర్థులు ఎంతగా ప్రయత్నిస్తున్నా.. ముగ్గురు ముఖ్యనేతలు అవగాహనతో పనిచేస్తూ వివాదాలు దూరంగా ఉంటున్నారని అంటున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్, యువనేత, మంత్రి లోకేశ్ పనితీరును గమనిస్తే వారి ముగ్గురి మధ్య బాండింగ్ ఏ స్థాయిలో ఉందో అర్థమవుతోందని, ఇదే పద్ధతి కొనసాగితే ప్రత్యర్థులు త ఆశలపై నీళు కుమ్మరించుకుని మరికొన్నేళ్లు వెయిట్ చేయక తప్పదని అంటున్నారు. కూటమిలో మూడు పార్టీలు ఉన్నప్పటికీ ప్రధానంగా ముగ్గురు నాయకుల చుట్టూనే రాజకీయం తిరుగుతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్, మంత్రి లోకేశ్ పర్యవేక్షణలోనే ప్రభుత్వం నడుస్తోంది. ఒక విధంగా చెప్పాలంటే ఉప ముఖ్యమంత్రి పవన్, మంత్రి లోకేశ్ ఇద్దరూ ముఖ్యమంత్రి చంద్రబాబు వద్ద రాజకీయ పాఠాలు నేర్చుకోడానికే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు. అయితే ఈ విషయంలో ఇద్దరూ ఒకరితో ఒకరి పోటీపడకండా సర్దుకుపోయేలా వ్యవహరించడమే రాజకీయంగా ఆసక్తి రేపుతోంది. ఇటీవల ఏపీని వణికించిన మొంథా తుఫాన్ తర్వాత ముగ్గురు నేతల వ్యవహరంపై రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ నడుస్తోంది. తుఫాన్ ముందస్తు సన్నద్ధతలో ముగ్గురు నేతలు కలిసి పనిచేయగా, ఆ తర్వాత ఒక్కొక్కరు ఒక్కో బాధ్యతను తీసుకోవడాన్ని ప్రత్యేకంగా ప్రస్తావిస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తొలుత తుఫాన్ బాధితుల పరామర్శకు వెళ్లి ఆ తర్వాత దైనందన ప్రభుత్వ కార్యక్రమాలల్లో బిజీ అయిపోయారు. ఇదే సమయంలో పవన్ పూర్తిగా క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లి రైతులు, ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే బాధ్యత తీసుకున్నారని చెబుతున్నారు. అదే సమయంలో మంత్రి నారా లోకేశ్ ఆర్టీజీఎస్ ద్వారా తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు, మరమ్మతు పనుల పర్యవేక్షణ చూసుకున్నారు. దీనివల్ల క్షేత్రస్థాయిలో పరిస్థితులు చక్కదిద్దడం ఒక ఎత్తైతే.. ఉప ముఖ్యమంత్రితో పోటీ పడకుండా ఆయనకు నైతిక మద్దతు ఇస్తూ పొత్తు ధర్మాన్ని పాటిస్తున్నారని అంటున్నారు. ఈ విధానాల వల్ల కూటమిలో భేదాభిప్రాయాలకు చోటు లేకుండా పోతుందని అంటున్నారు. ప్రధానంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కు పూర్తి స్వేచ్ఛనిచ్చినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ సంకేతాలు పంపుతుండటం కూడా రాజకీయ ప్రత్యర్థులు మింగుడు పడటం లేదని అంటున్నారు.

# 30 ఏళ్లు కాంగ్రెస్ నేనట.. తెలంగాణలో సాధ్యమా?

హైదరాబాద్,ఆశ పడవచ్చు. కానీ ఆ ఆశకు హద్దు ఉండాలి.. అర్హత ఉండాలి. దానిని సాధించాలి అన్న తపన ఉండాలి. కష్టపడాలి. అందరినీ కలుపుకుపోవాలి. రాజకీయాల్లో నేతలకు ఆశలు ఎక్కువ. పదవీ వ్యామోహంతోపాటు, సంపాదించాలి.. కీలక పదవులు అలంకరించాలని ఆశపడతుంటారు. చాలా మందికి అవి నెరవేరవు. కొందరికి అదృష్టంతో కలిసి వస్తాయి. అయితే ప్రస్తుతం తెలంగాణ కాంగ్రెస్ నేతల ఆశలు చూస్తే మాత్రం అత్యాశే అనిపిస్తోంది. అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తోంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన చాలా హామీలు నెరవేర్చలేదు. ఇక హైడ్రా, ధాన్యానికి బోనస్, పింఛన్ల పెంపు, మహిళలకు రూ.2,500 సాయం, విద్యార్థినులకు స్కూటీలు వంటివి అమలుకు నోచుకోలేదు. హైడ్రా హైదరాబాద్ వాసులను దెబ్బతీస్తోంది. ఇలాంటి తరుణంలో హస్తం నేతలు తాము రాబోయే 30 ఏళ్లు అధికారంలో ఉంటామని వ్యాఖ్యానించడం కొత్త చర్చకు దారితీసింది. మొన్నటి వరకు రేవంత్‌రెడ్డి పదేళు నేనే సీఎం అని ప్రకటించారు. ఇప్పుడు మంత్రి శ్రీధర్‌బాబు 30 ఏళ్లు తమదే అధికారం అని చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమైంది. ఇదే సమయంలో మాజీ క్రికెట్ కెప్టెన్ మహమ్మద్ అజారుద్దీన్ మంత్రి పదవి గురించి 'మీడియాలోనే తెలిసింది, నాకు అధికారిక సమాచారం లేదు' అని చెప్పడం పార్టీలో అంతర్గత విభేదాలకు నిదర్శనం.

ఆశా.. అత్యాశా..?

శ్రీధర్ బాబు వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీలోని ఆత్మవిశ్వాసాన్ని ప్రతిబింబిస్తున్నాయి. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన తర్వాత, పార్టీ 'రైజింగ్ తెలంగాణ' విజన్‌తో ముందుకు సాగుతోంది. ఆరు హామీల అమలు, ఉద్యోగ నియామకాలు, పెట్టుబడుల ఆకర్షణ వంటి చర్యలు ప్రజల్లో బలం పెంచాయి. అయితే 30 ఏళ్లు అధికారం అత్యాశే అని విశ్లేషకులు పేర్కొంటున్నారు. బీజేపీ బలపడటం, బీఆర్ఎస్ పునరుద్ధరణ ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో హామీలు నెరవర్చేకపోవడం పెద్ద మైనస్.

బలమా, బలహీనతమా?

కాంగ్రెస్‌లో మంత్రులు బహిరంగంగా వ్యాఖలు వివాదాస్పదమవుతున్నాయి. దీనిపై శ్రీధర్‌బాబు స్పందిస్తూ పార్టీలో ప్రజాస్వామ్యం ఎక్కువ అని పేర్కొన్నారు. ఇది ఒకవైపు సానుకూలం.. మరోవైపు బలహీనత కూడా. కాంగ్రెస్ అంటేనే కుమ్ములాటలు. ఒకరి ఎదుగుదలను మరొకరు ఓర్వలేనంత ప్రజాస్వామ్యం. ఇలాంటి పార్టీ ప్రజలను ఆకట్టుకుని 30 ఏళ్లు అధికారంలో ఉండడం అంత ఈజీ కాదు.

సవాళ్లు.. అవకాశాలు..



తెలంగాణలో అధికార కాంగ్రెస్ ముందు అనేక సవాళ్లు ఉన్నాయి. అంతర్గత విభేదాలు, విపక్షాల పునరుజ్జీవనం, ఆర్థిక సమస్యలు. బీఆర్ఎస్ యువతను ఆకర్షించడానికి ప్రయత్నిస్తోంది. బీజేపీ జాతీయ అంశాలతో బలపడుతోంది. అయితే, యువత ఉద్యోగాలు, మహిళల సాధికారత, గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులు వంటివి పార్టీని బలపరుస్తాయి. శ్రీధర్ బాబు వంటి నాయకులు ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేస్తూ, ఏకత్వాన్ని కాపాడితే, ఈ కల సాధ్యం కావొచ్చు. కానీ రాజకీయ చరిత్ర చూస్తే, దీర్ఘకాలిక ఆధిపత్యం పాలసీలపై ఆధారపడి ఉంటుంది, వ్యక్తిగత వ్యాఖ్యలపై కాదు. శ్రీధర్ బాబు వ్యాఖ్యలు కాంగ్రెస్‌లోని ధైర్యాన్ని చూపిస్తున్నాయి, కానీ అవి పరీక్షల సూచనలు కూడా. 30 ఏళ్లు ఆధిపత్యం కలలు కాకుండా నిజమవ్వాలంటే, అంతర్గత ఏకత్వం, పారదర్శకత, ప్రజా సంక్షేమం మీద దృష్టి పెట్టాలి. తెలంగాణ ప్రజలు మార్పును కోరుకుంటారు కాంగ్రెస్ దాన్ని అందిస్తే, ఈ కల నిజమవుతుంది. లేకపోతే, రాజకీయాల్లో ఆర్పు తప్పదు.

# టైం చాల్లేదు.. మరో రెండు నెలలు కావాలి...



హైదరాబాద్,టైం చాల్లేదు.. మరో రెండు నెలలు కావాలి అని కోరుతూ.. తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ ప్రసాదరావు సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరగాల్సి ఉంది. తాను ఎంతో బిజీగా ఉన్నాన ని.. న్యాయ వ్యవస్థపై గౌరవం ఉందని కానీ.. నిర్దేశించిన గడువులోగా విచారణ చేయలేక పోయానని ఆయన పేర్కొన్నారు. కాబట్టి.. మరో రెండు మాసాల సమయం ఇవ్వాలని సుప్రీంకోర్టును ప్రసాదరావు అభ్యర్థించారు.

ఏం జరిగింది?

తెలంగాణలో 2023లో జరిగిన ఎన్నికల్లో బీఆర్ ఎస్ పార్టీ అధికారం కోల్పోయింది. అయితే.. ఆ పార్టీ తరఫున 36 మంది విజయం దక్కించుకున్నారు. వీరిలో 10 మంది ఎమ్మెల్యేలు.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే.. ఆ పార్టీలోకి జంప్ చేశారు. అయితే.. పార్టీలు మారడం.. కొత్తకాకపోయినా.. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న బీఆర్ ఎస్ అధినేత కేసీఆర్.. పార్టీ మారిన వారిపై అనర్హత వేటు వేయాలని స్పీకర్ ప్రసాదరావును అభ్యర్థించారు. అయితే.. ఆయన తాత్సారం చేశారు. ఆ వెంటనే హైకోర్టును ఆశ్రయించి.. ఫిరాయించిన ఎమ్మెల్యేలపై ప్రజాప్రాతినిధ్య చట్టం మేరకు చర్యలు తీసుకునేలా స్పీకర్‌ను ఆదేశించాలని కోరారు. దీనిపై పలు మార్లు విచారణ జరిగింది. నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని హైకోర్టు కూడా ఆదేశించింది. ఇక, ఈ విషయంలో ఎటూ తేలడం లేదని భావించిన బీఆర్ ఎస్ సుప్రీంకోర్టు తలుపు తట్టింది. ఇక్కడ కూడా పలుమార్లు విచారణ జరిగింది. ఈ క్రమంలో స్పీకర్‌కు మూడు నెలల గడువు ఇచ్చిన సుప్రీంకోర్టు అప్పటి లోగా ఈ వ్యవహారాన్ని తేల్చాలని చెప్పింది. అయితే.. ఈ మూడు మాసాల్లో ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, పఠాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి తదితర నలుగురు ఎమ్మెల్యే లను మాత్రమే విచారించారు. మిగిలిన వారి విచారణ పెండింగులో ఉంది. మరోవైపు.. సుప్రీంకోర్టు ఇచ్చిన గడువు.. శుక్రవారం(అక్టోబరు 30)తో ముగిసిపోయింది. దీంతో తమకు మరో 2 మాసాల సమయం కావాలని కోరుతూ.. స్పీకర్ ప్రసాదరావు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేయడం గమనార్హం. అయితే.. ఫిరాయించిన ఎమ్మెల్యేలు మాత్రం.. తాము బీఆర్ ఎస్‌లోనే ఉన్నామని.. కేసీఆర్ తమ నాయకుడని చెబుతుండడం గమనార్హం.

## మొంథా తుపాన్‌తో రూ.5,244 కోట్ల మేర నష్టం

అమరావతి, ఏపీలో 'మొంథా' తుపాను బీభత్సంతో వాటిల్లిన నష్టంపై కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక నివేదిక అందించింది. మొత్తం రూ.5,244 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు వెల్లడించింది. తుపాను ప్రభావిత ప్రాంతాల పరిశీలనకు కేంద్ర బృందాలను పంపాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రానికి తక్షణ సాయం చేయాలని కోరారు. 249 మండలాల పరిధిలో 1,434 గ్రామాలు, 48 పట్టణాలపై తుపాను ప్రభావం పడినట్లు ప్రాథమిక నివేదికలో పేర్కొన్నారు.

## టీటీడీ పరకామణి చోరీ కేసు పై హైకోర్టులో విచారణ

అమరావతి,టీటీడీ పరకామణి చోరీ కేసు పై ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో శుక్రవారం విచారణ జరిగింది. ఈ క్రమంలో కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులకి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. న్యాయస్థానం నోటీసులు జారీ చేసిన వారిలో దేవాదాయ శాఖ ముఖ్యకార్యదర్శి, లీగల్ సర్వీసెస్ అథారిటీ మెంబర్ సెక్రటరీ, తిరుపతి మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ ఛైర్మన్, సీఐడీడీజీ, టీటీడీ ఈవో, సీవీఎస్ఓ, తిరుపతి వన్ టౌన్ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్ఓ, పరకామణి అప్పటి అసిస్టెంట్ విజిలెన్స్ సెక్యూరిటీ అధికారి సతీష్ కుమార్, నిందితుడు పీవీ రవికుమార్ ఉన్నారు. అయితే తదుపరి విచారణని నవంబరు 17వ తేదీకి న్యాయస్థానం వాయిదా వేసింది. పరకామణి చోరీ కేసులో లోక్ అదాలత్ ఇచ్చిన ఉత్తర్వుల చట్టబద్ధతను తేల్చే వ్యవహారాన్ని న్యాయమూర్తులు జస్టిస్

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com